# అసూయ

బోయి భీమన్న

**పాత్రలు :**

| | |
|---|---|
| రాజా | : విద్యార్థి కాంగ్రెస్ నాయకుడు |
| రాత్రి | : విశ్వం చెల్లెలు , రాజా స్నేహితురాలు |
| విశ్వం | : రాజా మిత్రుడు, సహాధ్యాయుడు |
| చండ భాస్కరరావు | : రాజా సహాధ్యాయుడు, ధనికుడు |
| దినం | : చండా మిత్రుడు |
| రేరాణి | : భూతాలు కూతురు |
| భూతాలు | |
| తాతాలు | : పల్లెటూరి పెద్దలు |

మరి కొందరు విద్యార్థులు, ప్రజలు, పోలీసులు.

# రంగం : 1

(కాకినాడలో ఒక మామిడితోట. సాయం సమయం, తెరలోనుంచి శ్రావ్యంగా పాట వినిపిస్తుంది)

సర్వసమ్మత సర్వసమతా, సామ్యభారత భారతి !
సస్యపుష్కల శ్యామమందార, స్వర్ణగర్భా భారతీ !
సకల సుకళాసార సారస్వత సరస్వతీ భారతీ !
శాంతి సౌఖ్య వసంతభూమీ, జన్మభూమీ భారతీ !

(పాట వింటూ, అది వచ్చేదిక్కు కేసి చూస్తూ, మెల్లగా చండ భాస్కరు, దినం ప్రవేశిస్తారు.)

చండ : ఓరేయి దినం వాళ్ళేరా !

దిన : వాళ్లే, వాళ్లే !

చండ : మనం పుస్తకాలు నూరుకు తాగినా నాలుగు మార్కులు వచ్చి చావవ్. అలాంటి వాళ్ళమీద పడి రాసుకుంటుందేమిరా - ఆ సరస్వతి ముండ!

దినం : అసలు ఆడవాళ్ళ స్వభావమంతా అంతేరా. రౌడీగుణాలే ఆకర్షిస్తాయి వాళ్ళని, అదిగో చూడ్రా ! (ముందుకు చూపుతూ) ఆ రాత్రి, ఆ రాజాగాడితో ఎలా రాసుకుంటూ పోతూవుందో !

చండ : అసలు క్లాసులో కూడా ఒకళ్ళ నొకళ్ళు చూచుకోడం తప్పితే, వాళ్ళు పాఠాలు వినవే వినరు. మరి మార్కు లెలా వస్తాయోరా, వీళ్ళకి !

దినం : చదివితేనేనా యేంటిలేరా, మార్కులు రావడం ? కాదు గాని - వీళ్ళు రోజూ సాయంత్రం ఇలా పోతుంటా రెక్కడికో ! ఈ వేళ వీళ్ళ అంతు కనుక్కోవాలిరా.

చండ : మన పేకాట ప్రోగ్రాం ?

దినం : ఔన్రా, మరే ?

చంద : (ధీర్ఘంగా ఆలోచించి) పేకాట కొంచెం సేపు ఆగుతుందిలే పద-

దినం : పద (చూచి) వాళ్ళప్పుడే ఆ మామిడి ముసుగులో మాయమైనారు. (యిద్దరు నిష్క్రమిస్తారు. అంత వెనుకనుంచి రాజా, రాత్రి, విశ్వం ప్రవేశిస్తారు.)

విశ్వం : ఒరే రాజా ? వాళ్ళింకా ఇళ్లకి చేరుకోరురా, ఇక్కడ కాసేపు కూర్చుని పోదాం?

రాత్రి : ఇంకా రారా ? ప్రొద్దుగూకి పోయినా ?

రాజా : వాళ్ళంతా కూలీలు. చంటిబిడ్డ తల్లులు కూడా ఇంకా ఇళ్లకు చేరరు. కొందరు ఇప్పుడు కూడా తెచ్చుకునే కూలి ధాన్యాన్ని దంచి వండుకోవాలి.

రాత్రి : అబ్బా, ఎంతకష్టం !

విశ్వం : అంత కష్టపడేవాళ్ళు వుండబట్టే, ఇంత సుఖపడేవాళ్ళు వున్నారు.

రాజా : (చలోక్తిగా) పగలు వున్నది గనుకనే రాత్రి వుండగలుగుతూ వుంది.

రాత్రి : నీ పోలిక సరికాదు, రాజా ! రాత్రింబగళ్ళు సమానాలు. కష్ట సుఖాలు సరి సమానంగా లేక, కష్టమంతా ప్రత్యేకంగా ఏ ఒక్కవర్గమో పడక తప్పకపోతే, బ్రతకడం అనవసరం.

విశ్వం : ఈ సుందరమైన సాయంకాలం, ఈ మనోహరమైన సహకార వనం, హాయిగా అనుభవించడానికి గాని - ఏవో కష్టాల్ని తలపోసుకుంటూ కష్టపడటానికి కాదు చెల్లీ ! ఏదా ! ఇందాకటి పాట మళ్ళీపాడు.

రాత్రి : ఇప్పుడు నేను పాడలేను.

విశ్వం : లోకవ్యవహారాలలో పగలంతా పరిశ్రమించి అలసిపోయే మనస్సును

రంజింపజేసి, తిరిగి శక్తిమంతం జెయ్యడానికే ఈ ప్రకృతి సౌందర్యమంతా. విశ్రాంతికాలంలో విషమ సమస్యాచర్చ లెందుకు? కాస్త పాడుదు.

రాత్రి : నాకేనా పాటలురావడం ? మీరు పాడగూడదేం ?

విశ్వం : పోనీ నే నే పాడతా.

నీకై మోహముతోడ, ఈసుమవ నానేక ప్రతీరమ్ములన్,
ఆక్రమోదయగీతికారవములన్, ఆయాదయాసుందర
శ్లోక స్వాంతములన్, సదా వెదకు కొంచున్ వచ్చు నీ నెచ్చెలిన్
నాకే నీ వనుమానమైన నెవడెంచన్ జాలు నిన్నో ప్రభూ !

రాజా : (అంత వరకూ పదధ్యానంగా ప్రకృతి రామణీయతను అనుభవిస్తూ వుండి) రాగం బాగుందిరా !

రాత్రి : పద్యమూ బాగానే వుంది.

విశ్వం : రాజా నాస్తికుడుగా ? పద్యమెలా బాగుంటుందిలే,

రాజా : నేను సామ్యవాదిని

రాత్రి : కానివారెవరు ?

విశ్వం : కూడు, గుడ్డ, కొంప ప్రజలందరికీ సమానంగా వుండాలి. ఎక్కువ తక్కువ లుండగూడదు. ప్రపంచం ఇవ్వగల అన్ని సౌఖ్యాలూ అందరికీ సమానంగా లభించాలి. అదేనా నీ సామ్యవాదం ?

రాజా : ఎవరి సామ్యవాదమైనా ఒక్కటే.

విశ్వం : అంతమాత్రం చేత వ్యక్తిత్వాన్ని అభిరుచినీ చంపుకోవాలని ఎక్కడుందీ ?

రాత్రి : నాకు పనస తొనలిష్టం, విశ్వానికి జీడిపప్పు ఇష్టం. నీకు మామిడి పండ్లిష్టం, ఎవరికి ఇష్టమైనవి వారికి లభించడమే గదా ప్రజా రాజ్యం?

రాజా : నిజమే. విశ్వమయమైన మహాశక్తినే దేవుడనీ, దెయ్యమనీ అంటామంటే నా కభ్యంతరంలేదు. కాని ఆశక్తిని పూజించడమూ, ప్రార్థించడమూ మాత్రం అనవసరం. అనవసరమే కాదు, అనర్థకం కూడా. మూఢ విశ్వాసాలకు ప్రజల్ని బానిసలుగాచేసి, వారిని దోచుకొన్నది మతం ఇంత వరకూ. అట్టి ప్రమాదం మళ్లీ జరగడానికి మనం అవకాశమివ్వగూడదు.

విశ్వం : తీవ్రసమస్యల్లోకి మళ్లీ దింపుతున్నారు. రాజా ! నీవొకటి పాడ్రా !

రాజా : నాకు విరహగీతాలంటే అసహ్యం.

రాత్రి : ఏం ?

రాజా : బాధ ఏదైనా బలహీనతనే సూచిస్తుంది. బలహీనుల మొర దయనీయమే గాని, అనుసరణీయమూ కాదు - ఆనందకరమూ కాదు.

విశ్వం : పోనీ విప్లవగీతాలే పాడు.

రాజా : మీ అన్నా చెల్లెళ్ళిద్దరిలాగా నేను పాడలేను. రాత్రీ ! ఏదీ మొన్నటి పాట.

రాత్రి : నీవు పాడితేగాని నేను పాడను.

రాజా : సరే (కంఠం సవరించుకొని) ఈ చుట్టుప్రక్కల గార్ధభాలు ఏవీ లేవుగద!

విశ్వం : నీ పాట సంగతి మాకు తెలుసు కానీరా !

రాజా : (శ్రావ్యంగా పాడతాడు)

ప్రేమము, విప్లవమ్ము, భారత బాహుయుగమ్ము దాల్చి, ర
క్షామతి నొప్పు నీక తగు, గాక మహాత్మ ! ప్రపంచరంగమం
దేమరుపాటు లేక నటి, యించిన చిత్రనటాత్మ నీవు; నీ
ప్రేమకు విప్లవమ్మునకు, విశ్వమె సన్నుతులిచ్చు గోపకా !

ఏదీ ! రాత్రి !

రాత్రి : (ఆనందాన్నుంచి తేరుకొని) ఏమిటి నేను పాడాలా ? కోకిల పాడిన తరువాత గోరింక అరవడం ఏం బాగుంటుంది, రాజా ?

విశ్వం : త్వరగా పాడుదు. రాత్రి పడుతోంది.

రాజా : రాత్రి పాడుతోంది.

రాత్రి : రాత్రే పాడుతోంది – అదిగో !

(తెరలో పాట)

చూడచక్కనివాడు, సుందరాకారుడే
శోభాయమానుడె మారాజు;

కలువ కన్నులవాడు చలువచూపులవాడు,
చెలివంపు చెలికాడె మారాజు;

ఇరులెల్ల కురులు, చిందరవందరగ వీడ,
తెరువులే గనిపెట్టు మా రాత్రి.

తరుణి గ్రుంకినను తొందరలేదే రాజుకని
విరహగీతులు బాడుమా రాత్రి.

విశ్వం : చెల్లీ ! ఆ కంఠం ఎక్కడనో విన్నట్టుంది !

రాజా : అదిగో – కూలీలు ఇండ్లకు పోతూవున్నారు. ఇక మనం లేవాలి. రాత్రీ –

రాత్రి : (వెంటనే కంఠమెత్తి పాడుతుంది)

విశాల వినీల వినువీధులలో, విహారములు చనలేవా ?
రెక్కలేల నీకు ? పక్షీ !

వసంత లతాంత హృదంతరముల, పాడలేవె మధురముగా?
కంఠమేల నీకు ? పికమా !

సమస్త వస్తు సమృద్ధి మధ్యనే, సౌఖ్యములేదా నీకు ?
బ్రతుకేలా, ఓ మనిషీ !

విశ్వం : ఓహో ! మహాc బలే క్రాంతి గీతాలు నేర్పారు ! (అభినయిస్తూ)

పదండిరా ! పదండిరా !
ముందుకు తోసుకు పదండిరా !
అడవులు కొండలు
అడ్డంబైనా
లెక్కచేయకా
ఒక్క వూపుతో
ఆగక పదండిరా !
అవతల పదండిరా !

రాజా, రాత్రి : (కరతాళ ధ్వనులు చేస్తూ) బలే, బలే ! !

రాజా : బాగుందిరా విశ్వం !

రాత్రి : పదండి, ఇక అవతల పడతాం.
(అందరూ బైలుదేరుతారు)

విశ్వం : అదిగో, అదే సర్పవరం

రాత్రి : అవిగో దీపాలు !

రాజా : అవే పేదలగుడిసెల్లోని క్రాంతి దీపాలు.

(అందరూ నిష్క్రమిస్తారు. వెనుకనుంచి చండభాస్కరు, దినం ప్రవేశిస్తారు.)

చండ : తెలిసిందిరా, తెలిసింది, పద - వెనక్కిపద.

దినం : వాళ్లంతా ముందుకు పోతూంటే, నీవు వెనక్కి నడవమంటున్నావ్! ఏమి తెలిసిందేమిటి ?

చండ : ఏమి తెలియడమేంటి, నీ మొఖం ? అంతా తెలిసింది. ఏమిట్రా నీ బొంద ! తెలియలా ? ఇక వీళ్ళు మనగుప్పెట్లో చిక్కారన్నమాటే, ఏమంటావు ?

దినం : చచ్చినట్టు.

చండ : ఆ రాత్రికి అదేంబుద్ధిరా ? రాత్రుళ్ళు వీళ్లతో ఈ తోటలమ్మట తిరగడం –

దినం : ఆమె కొంచెం మంచిదే అంటార్రా.

చండ : దిబ్బమంచి.

దినం : వాళ్లన్న విశ్వంగాడు కూడ, కూడానే వున్నాడు.

చండ : వాడో చవట. అలాకూడా వుండడానికే పనికొస్తాడు. మంచివాడు మంచివాడంటుంటే ఆ రాజాగాడు ఎంత పని చేస్తున్నాడో చూడ్రా!

దినం : పైగా, మనకు చెప్పకుండా !

(అంత ఆ దార్ని ఇండ్లకు పోతూవున్న తాతాలు, భూతాలు మరికొందరు కూలీలు ప్రవేశిస్తారు)

తా : ఇక్కడ వున్నారేం ? పదండి బాబయ్యా !

చండ : ఎక్కడికోయ్ ?

భూ : (నిదానించిచూచి) ఆ బాబులు కాదురా, వీరు, తాతాలు !

తా : (తేరిచూచి) ఆ బాబులే అనుకున్నానురా, భూతాలు !

(ఆ ఇద్దరితో) మరేం అనుకోకండి బాబూ !

దినం : ఏ బాబు లోయ్, అబ్బీ ?

తా : వారండి ? వారండి – ఆ రాజాగారు.

భూ : ఇంకా వున్నారులెండి చాలమంది.

చం : అదాసంగతి! తెలిసిందిలే.

దినం : ఏమిటోయ్ అబ్బీ, ఏదీ చెప్పు - వాళ్ళు మీ వూరు వస్తూ వుంటారు కదూ ?

తా : ఔనండీ. అప్పుడప్పుడు వస్తూ మంచీచెడ్డా బోధించుతూ వుంటారు.

చండ : మీదే వూరు ?

తా : సప్పారం.

చండ : ఇంకా సప్పారమే ? సర్పవరం అనలేవూ ?

భూ : అనగలిగితే మాకీ గతేమండి బాబూ ?

దినం : మరింకేమిటి వాళ్లు బోధించి చస్తున్నది ?

భూ : బాగా బ్రతకాలనీ, శుభ్రంగా వుండాలనీ, చదువుకోవాలనీ -

తా : రాత్రి బడివోటి పెట్టారండి. మేమంతా చదువుకొంటున్నాం.

భూ : వారంతా చందా వేసుకొని ఒక మంచినీళ్ళ నూయి త్రవ్వించి పెట్టారండి.

తా : ఒక సంఘం స్థాపించారండి. మా కప్పుడే ఏభైరూపాయలు నిలవవుంది.

భూ : బడిసాలకూడా వెయ్యించి పెట్టారు.

తా : మగపిల్లలకి వేరూ, ఆడపిల్లలకి వేరూ, కలాసులు చెపుతున్నారు.

భూ : మా అమ్మాయి అప్పుడే మూడో పుస్తకం పట్టింది.

తా : మీరుకూడా వస్తేరండి. మా పేట ఒకసారి సూద్దురుగాని.

దినం : ఎందుకులే మే పోతాం.

చండ : చీకటిలో మా వాడికి భయం.

భూ : మీరు చెయ్యకపోతే మానింది. చేసేవార్ని చూసైనా సంతోషించండి బాబయ్యా !

చండ : మాకు టైం లేదోయ్.

దినం : లేకపోతేనా – వాళ్ళ తాతల్లాటి పనులు చేసేవాళ్ళం. (ఇద్దరూ వెనక్కు నిష్క్రమిస్తారు.)

తా : అయ్యో, బాబులు !

భూ : ఇల్లాంటి బాబులేరా, మనల్ని ఈ పెంటకుప్పల్లో పాతేసి, దరిద్రంలో ఊర ద్రొక్కి వుంచారు.

తా : ఇప్పుడు దేశమంతా మేలుకుందిలేరా ! ఇక వీళ్ళ ఆట లెలా సాగు తాయి!

భూ : రాజాగారిలాంటి యువకులు పదిమంది చాలురా, ఇలాంటి వాళ్ళు లక్షవుండేకంటే.

తా : అయిగో, గుడిదగ్గర దీపాలు ! అందరూ వచ్చేసినట్టుంది.

భూ : అవిగో పాటలు కూడా వినిపిస్తున్నాయి.

(అందరూ నిష్క్రమిస్తారు. తెర)

# రంగం : 2

(కాలేజీ ఆవరణ, విద్యార్థులంతా సంకులంగా తిరుగుతూ వుంటారు. విద్యార్థి కాంగ్రెస్‌ను నిర్మిస్తున్న రోజది. చేతిలో ఒక కాగితంతో రాజా ప్రవేశిస్తాడు)

రాజా : మిత్రులారా ! నేడు మనం విద్యార్థి కాంగ్రెస్‌ను ప్రారంభం చేస్తున్నాం. నేడు విద్యార్థులు రేపు పౌరులు, కాగా ఈ మన కాంగ్రెస్ అభ్యుదయ మార్గాలలో పని చెయ్యాలి. పూర్వాచారాలను, పెట్టుబడివారీ విధానాన్ని ఎదిరించి పోరాడే సోషలిస్టు సంస్థగా మన కాంగ్రెసు బలపడాలి, పురోగమించాలి.

చండభాస్కరుడు : (రెండోప్రక్కనుంచి వస్తూ) ఏమిటిరా సోషలిజం, నీ బొంద? అలాంటి రాజకీయాలు మనకెందుకు, స్టూడెంట్లకి?

విశ్వం : (మొదటి వైపునుంచి వస్తూ) స్టూడెంట్సుకి రాజకీయా లక్కర లేదంటావా?

దినం : (రెండోప్రక్కనుంచి వస్తూ) మనకి రాజకీయా లేమి అర్థమై చస్తాయిరా ?

విశ్వం : నిజంగా రాజకీయాలు చచ్చినా బాగుండును. ప్రజలు కొంత సుఖపడుదురు. కాని ...

చండ : కాదురా. ఇప్పుడు మనం ఒక పార్టీకి కమిట్ అయిపోతే...

రాజా : ప్రమాద మేమీ లేదు లేరా. ప్రకృతి లాగా, ప్రపంచంలాగా రాజకీయాలు కూడా క్షణక్షణమూ మారుతూవుంటాయి. నేడు మానవసంఘానికి సోషలిజం మంచిదంటున్నాం. రేపు మరొక ఉత్తమమైన వ్యవస్థ ఏదో మనకు తట్టవచ్చు. మానవుని సౌఖ్యాన్వేషణలో ఇవన్నీ చలివేంద్రలు, మజిలీలు.

విశ్వం : నీ కిష్టం లేకపోతే అప్పుడు మరో సిద్ధాంతమూ, పార్టీ లేవదీద్దుగాని లేరా.

చం : పరిస్థితుల్ని బట్టి పార్టీ లుంటాయి. దానికేంగాని ...

రాజా : అదే నేను చెప్పేది కూడా.

దినం : రాజకీయాల్లో పార్టీలు మార్చడం... చొక్కాతీసి చొక్కా తొడుక్కోవడం లాంటిది.

విశ్వం : రైటో ! నీవు బలే అగండుడివిరా, దినం !

చండ : ఔన్రా ! నీవేదో గమ్యస్థానం పెట్టుకొన్న తర్వాత దాన్ని చేరుకోడానికి ఏ మార్గమైనా అనుసరించవచ్చు.

విశ్వం : రాజకీయాలలో గమ్యస్థాన మేమిటిలేరా, స్వార్థమూ, స్వోత్కర్షా తప్పితే నేటి రాజకీయాలకు వేరే పరమావధి ఏమీలేదు.

రాజా : అలాగనకురా విశ్వం, బుద్ధుడు, జీసస్, మహమ్మద్, లెనిన్, గాంధీ మొదలైనవారి రాజకీయాలలో స్వార్థమూ, స్వోత్కర్షా ఏమున్నాయి? ప్రజాశ్రేయస్సే, మానవాభ్యుదయమేగదా వారు కోరింది?

విశ్వం : ఏదో వెయ్యేసి సంవత్సరాల కొక్కొక్క మహాపురుషుడు పుడితే పుట్టవచ్చు, సామాన్య మానవుల్ని తీసుకోవాలి ఉదాహరణగా.

రాజా : సామాన్య మానవులనీ, అసామాన్య మానవులనీ – ఇలాంటి తేడాలు లేకుండా చెయ్యడమే సామ్యవాదం ఉద్ధేశం.

దినం : అలాంటి తేడాలు నువ్వులేకండ చెయ్యలేవురా, రాజా !

చండ : కుక్కలూ, గంగగోవులూ ఒకటెలా అవుతాయిరా ?

విశ్వం : ఔను; ముళ్ళ చెట్లకీ, మామిడి చెట్లకి స్నేహ మేమిటి, పదరా రాజా !

(అంత రాత్రి ఒక పూలదండతో ప్రవేశిస్తుంది)

రాత్రి : ఏమిటి మీరంతా ఇక్కడే వున్నారు ? విద్యార్థులంతా వచ్చేశారు పదండి.

చండ : ఎక్కడ సమావేశం ?

రాత్రి : నోటీసులో వుంది చూడలే ?

చండ : (దినం వంక చూస్తాడు)

దినం : ఔన్రా, క్వాడ్రాంగిల్ షెడ్డులో

రాత్రి : (నవ్వి) అయ్యో దినం !

విశ్వం : మన కాలేజీ వెనుకవున్న మామిడితోటలోరా ! పదండి.

రాజా : (చేతిలో కాగితం రాత్రి కందిస్తూ) ఇదిగో నీవు కావాలన్న పేపరు.

రాత్రి : థాంక్సు (అందుకుంటుంది)

విశ్వం : (రాత్రి చేతిలోంచి హఠాత్తుగా కాగితాన్ని లాక్కుని) ఏం పేపర్రా? (విప్పి చదువుతాడు) ఓస్, ఇదా.

దినం : ఏమిట్రా అది (చూస్తాడు) ఓస్, ఇదా.

చండ : అసలదేమిటో చెప్పండ్రా. (దగ్గర కొస్తాడు)

రాజా : అది ఎప్పటిదో పాతపేపరురా, సర్వీస్ కమీషన్ పరీక్షలకు సంబంధించినది.

విశ్వం : ఇందులో ప్రశ్నలు చాలా గమ్మత్తుగా వున్నాయిరా !

దినం : ఓ! థర్డుఫారం వాడుకూడా ఆన్సర్ చెయ్యొచ్చురా,

చండ : (తొంగిచూచి), ఫోర్తుక్లాస్ వాడుకూడా ఆన్సర్ చేస్తాడు.

విశ్వం : (కాగితం లాక్కుంటూ) అయితే ఏదా ఆన్సర్ చెయ్యి చూదాం. క్షీరసాగరం అనగా నేమి?

చండ : సప్త సాగరాల్లో వొక టనుకుంటా.

(అందరూ నవ్వుతారు)

రాజా : కాదు – సంసారసాగరాల్లో వొకటి

(మరీ నవ్వుతారు)

చండ : పోండ్రా, పదరా, దినం, పోదాం.

రాత్రి : ఎక్కడికి ? ఇంకావున్నాయి ప్రశ్నలు.

చండ : మేం చెప్పిన జవాబులు మీకు పనికి రావుగా ?

విశ్వం : అంత కోపమెందుకురా, ఏదో సరదాకి నవ్వితే అదో రకమైన నవాసాగరం లేరా.

రాజా : అవే పోయిన ప్రశ్నలు చాలించంఁడ్రా, పదండి అక్కడ అంతా ఎదురు చూస్తూ వుంటారు.

(అంత పూలదండలతో కొందరు విద్యార్థులు ప్రవేశిస్తారు)

వి : జై - విద్యార్థి కాంగ్రెస్‌కూ -

అందరూ: జై.

వి : జై - విద్యార్థి నాయకుడు రాజాకు....

అందరూ : జై.

రాత్రి : ఏమిటి, అందరూ ఇలా వచ్చేశారు ?

వి : ఈ మహాసభకు రాజాను అధ్యక్షుడుగా కోరడానికి తీర్మానించారు.

చండ : ఎవఁడ్రా తీర్మానించింది ?

వి : విద్యార్థులంతా, (రాజాకు దండవెయ్యబోతాడు)

రాజా : (నిరాకరిస్తూ) నాకు అధ్యక్షపదవి ఏమిట్రా, నా మొఖం ? నె నెప్పుడూ మీతో వుంటూ శక్తికొలది సేవచేసేవాణ్ణే. మరొకణ్ణి ఎన్నుకోండి.

దినం : ఒరే ! నువ్వుంఁడ్రా, చంఁడ్రా ! మన చండ భాస్కరఁరావుకి ఇవ్వండిరా, ఆ పదవి.

విశ్వం : విద్యార్థి కాంగ్రెసుకు ప్రసిడెంటు అంటే అయ్యర్ హోటల్లో ఇడ్డెన్లు తినడం కాదురా, దినం.

రాత్రి : రాజా ! అడ్డుచెప్పకు, (అందరూ రాజా మెడలో పూలదండ వేస్తారు)

విశ్వం : ఇక పదండిరా.

(ఊరేగింపు గీతం పాడుతూ నిష్క్రమిస్తారు. చండభాస్కర్, దినం వెనక్కు మిగిలిపోతారు)

చండ : (అసూయతో) చూశావురా, దినం ?

దినం : దినంలాగే వుందిరా, ఇదంతా.

చండ : అమ్మ ! !

దినం : కాదుగాని, ఒరే, ఎన్నిసార్లు చెప్పాన్రా నీకు – ఆ అయ్యరు హోటల్లో వీళ్ళందరి ఎదరా ఏమీ తినవద్దురా – అని ?

చండ : తింటే ?

దినం : పట్టుకు పాతికేసి ఇడ్డెన్లు, మానెడేసి పచ్చడి చొప్పున గంటకు మూడేసిసార్లు ఎక్కించేస్తుంటే - మరి - చూసేవాళ్ళకి అలుసు కాదట్రా ? అదే నీ అధ్యక్షపదవికి అడ్డువచ్చిపడింది.

చండ : ఓరి గుంతా, ఎంత శుంఠవురా ! నాకు పదిలక్షల రూపాయల పూర్వార్జితం వుంది. మరి తినక తగలేసుకోమంటావురా ? ఉన్నవాణ్ని చూచి లేనివాళ్ళెప్పుడూ ఏడుస్తారు. వాళ్ళేదో ఏడ్చారని నీవు అఘోరించకపోతే ...

దినం : (మనస్సు దెబ్బతిని) పోనీలేరా !

చండ : ఇది చెప్పరా ! నీకూ నాకూ తేడా లేదా ?

దినం : ఎందుకు లేదు !

చండ : ఏమిటో చెప్పు ఆ తేడా ?

దినం : (కటువుగా) నా తాతముత్తాతలంతా బాగా తిని చచ్చారు. నీ తాతముత్తాతలంతా ఏమీ తినక చచ్చారు. అదీ తేడా.

చండ : .... .... .... ...... ....

దినం : .... .... ..... .... ...

(కొంతసేపు మౌనం)

చండ : నేను తిన్నట్టు నీవు తినలేవు.

దినం : నేను చదివినట్టు నువ్వు చదవలేవు.

చండ : నేను నీకు డబ్బుసాయం చెయ్యకపోతే నీ చదువు చంకనాకి పోతుంది.

దినం : నేను నీకు పరీక్షలో కాపీలు అందివ్వకపోతే నీకు వచ్చే మార్కులన్నీ బండి సున్నాలే.

(మళ్లీ కొంతసేపు మౌనం)

చండ : ఒరే దినం, మనం ఒకొళ్ళకొకళ్ళం అవసరమనుకుంటునురా !

దినం : అసలు అందుకోసమే పుట్టామేమోరా !

చండ : (భుజంమీద చెయ్యివేసి) మనం పోట్లాడుకోవద్దు.

దినం : అవమానించుకోవద్దు.

చండ : సరే ఇప్పుడేమిటి కర్తవ్యం ?

దినం : అదే ఆలోచిస్తున్నా.

చండ : నాకో ఉపాయం తట్టిందిరా.

దినం : ఏమిటది ?

చండ : అదే నువు చెప్పు.

దినం : మనం వాళ్ళకి తెలియని ప్రశ్నలు కొన్ని తయారుచేసి వాళ్లని ఏడిపిస్తే?

చండ : ఫస్టురా బ్రదర్ ! నీ మెదడు మైసూర్ పాకంరా?

దినం : దానితో వాళ్ళకున్న ఆ పేరుకాస్తా పోతుంది.

చండ : ఒరే అవునుగాని, వాళ్ల కెందుకొస్తుందిరా ఆ పేరు?

దినం : ఈ మన స్టూడెంటుగాళ్ళకి బుర్రల్లేవురా, గొర్రెల్లాగ ఏది ముందు పోతే దాని వెంట పరిగెడతారు. గాంధీగారి వెంట పోతూ అక్కడ నెహ్రూకనిపిస్తే వాడివెంట పడతారు. మళ్ళీ బోసువెంట – జోషీవెంట – జై ప్రకాష్ వెంట – ఇంకా ముందు ముందు ఎందరి వెంటబడతారో ఈ తుంటర్లు.

చండ : మన టెక్స్టుబుక్కుల్లో ఈ పేర్లేమీ లేవనుకుంటానురా !

దినం : నిన్నందుకే రోజూ పేపరు చదవరా అని మొత్తుకుచచ్చేది. ఇవన్నీ తెలిస్తే నీవు సుళువుగా అధ్యక్షుడివికావచ్చు.

చండ : పోరా పేపర్లు చదివే ఈ లక్షలాది మంది ఏం ప్రసిడెంట్లయి చస్తున్నారు? ఈ రాజాగాడిలో ఏదో ప్రత్యేకత వుందిరా.

దినం : అసలు వాడిలో కాదు వుంట. విశ్వంగాడిలో.

చండ : వాడి చెల్లెల్లో, ఇంకో విషయం, ఈ ముఠాకి ప్రజల్లోకూడా ఎంత పేరువుందో చూశావుగా ?

దినం : ప్రజల సంగతే చెప్పు. చప్పిడి కుడుం చేతిలో పెడితే పండగ చేసుకునే అల్పులురా ప్రజలంటే. ఈ వేళ రాజాను నాయకు డంటారు. రేపు మనం ఒక గుడి కట్టించి పెడితే వోట్లన్నీ మనకే వేస్తారు. ఎదట వున్నవాడే పెళ్ళికొడుకు ప్రజలకి.

చండ : వొండర్‌ఫుల్ ! !

దినం : అందువల్ల ప్రజల సంగతి మనం ఏమీ ఆలోచించ నక్కరలేదు గాని, మిడిమిడి జ్ఞానంతో మిడిసిపడే స్టూడెంట్లే –

చండ : ప్రశ్నలు తయారు చేస్తున్నాంగా ? దానితో స్టూడెంట్లలో రాజాగాడి ప్రభ సున్నా చుట్టి వస్తుంది.

దినం : అప్పుడు నీవు ప్రసిడెంటువు కావచ్చు.

చండ : ఈలోగా మనం అయ్యర్ హోటల్లో స్టూడెంట్ల కందరికీ పార్టీ ఇస్తే-

దినం : రైట్, రాత్రిని కూడా పిలు.

చండ : మైడియర్, అది లేనిది పార్టీ ఏమిటి ?

దినం : ప్రశ్నల సంగతి –

చండ : మరేరా ఏదీ – ఒకటి –

దినం : వాళ్లకి అర్థం కాగూడదు.

చండ : చచ్చినా సరే.

దినం : కుక్క చెప్పుల్నే ఎందుకు కొరుకుతుంది ?

చండ : దేవాలయాల్లో గబ్బిలాయలు ఎందుకుంటాయి ?

దినం : ఆడాళ్లకు మీసాలెందుకు రావు ?

చండ : అన్నం తినే పశువులు ఏవి ?

దినం : ఫస్టురా !

చండ : తిరిగి వీటికి మనల్నే జవాబులు చెప్పమంటేనో ?

దినం : వాళ్లే ఓడినట్టు.

చండ : ఇంకో రకం ప్రశ్నలు చెప్పరా.

దినం : మంచివాణ్ణి ప్రజలకు చెడ్డవాడుగా చూపడ మెలాగ ? ప్రజల అభిమాన నాయకుణ్ణి ఆ ప్రజచేతనే కొట్టించడం ఎలాగా ? ప్రజల్ని లోబరచుకోడానికి సులువైన మార్గం ఏది? త్యాగం ఏమీ అవసరం లేకుండా అధికార పదవులు ఎలా వస్తాయి? ఇంకొకణ్ణి ప్రేమించే స్త్రీని స్వాధీనం చేసుకోవడం ఎలాగ?

చండ : పంచరత్నాలురా ! పంచరత్నాలు ! ఓరి నీ దుంప తెగా ? వేడి వేడి ఇడ్లీలాగ

పనిచేస్తుందిరా నీ బుర్ర ! ఇంత రాజకీయపు సరుకు నీ దగ్గర పెట్టుకొని రేషన్ తగలేస్తున్నా వేమి నాకు ? ఓరి నిన్ను తగలెయ్యా ! ! ఇకవాళ్లు చచ్చారన్న మాటే.

దినం : చూస్తావుగదట్రా ! రాజాగాణ్ని పడదోసి, ఆస్థానంలో నిన్ను ప్రతిష్ఠ చెయ్యకపోతే –

చండ : వాణ్ణిచూస్తే నాకు సీమమిరపకాయ అక్కడ రాసుకున్నట్టేరా, వాడి చుట్టూ అంతమంది మూగడం – పేడకు ఈగల్లాగ – నాకు మరీ ఇదిగా వుంది.

దినం : అదేగా నాకూ పట్టుకుంది ? వీడి సోషలిజం గంగలో కలిపేస్తా, చూడు మరి.

చండ : గంగదాకా ఎందుకు, గోదావరి అను, ఎంతదగ్గర్లోపోతే అంత మంచిది.

దినం : ఇక నీకు ప్రసిడెంటుగిరీ తప్పదురా.

చండ : నాకు వచ్చినా, రాకపోయినా, ముందు వాడిది పోయేలాగ చూడు. విజయంలో నమ్మకం ఏర్పడుతున్నకొలదీ నాకు కార్యసాధనలో తొందర అధికమౌతూవుంది.

దినం : ఓ, (చూసి) అదేంరా ? అలా వాణికిపోతున్నావ్ ?

చండ : తొందరరా !

దినం : పద, ఇంటికి పోదాం.

చండ : ముందు కాఫీ హోటల్‌కు.

దినం : మీ నాయనగారితో మాట్లాడాలిరా ఈ విషయం.

చండ : నా మీదకేం రానివ్వకేం.

దినం : చా. చా.

(నిష్క్రమిస్తారు. తెర)

## రంగం : 3

(విశ్వం గృహోపవనం, సాయం సమయం, గృహావరణలో వున్న పూలమొక్కలకు నీళ్లు పోస్తూ, మధ్య మధ్య పాడుతూవుంటుంది రాత్రి.)

రాత్రి : (పాట)

ఎవరే పిల్తురు నన్ను ? కమనీయంగా
కలకంఠముతో ఎవరేపిల్తురు నన్ను ?
ఎవరే పిల్తురు నన్ను ?
ఆ – మావుల మాటున ఆ – పూవుల చాటున,
సంధ్యారాగపు జననికలో ?
ఎవరే పిల్తురు నన్ను ?
ఏ – కోయిలవో ? ఏ – తుమ్మెదవో ?
మోహము తీరని మూగవాణివో ?
ఎవరే పిల్తురు నన్ను ?

(అంత తాతాలు, భూతాలు, రేరాణి, మరికొందరు ప్రజలు హడావిడిగా ప్రవేశిస్తారు. కొందరికి దెబ్బలు కూడ తగిలివుంటాయి)

భూ : దండాలమ్మా, దండాలు !

అందరు: దండాలమ్మా, దండాలు.

రాత్రి : (ఆశ్చర్యంతో) ఏమిటి మీరందరూ వచ్చారు ? ఏమిటి రాణీ ? (దగ్గరకుపోయి చూచి) అమ్మో ! ఈ దవడ వాచిందేం ! (అందర్నీ పరీక్షగా చూచి) ఆ దెబ్బలేమిటి, భూతాలు ?

భూ : మా భూ ఖామందుగారు మమ్మల్ని చావా చితకా తన్నించారమ్మా! ఇళ్ళల్లోనుంచి లేచి పొమ్మంటున్నారు.

రాత్రి : (చకిలితయై) ఆc !

తా : పిల్లల్ని, ఆడోళ్ళనీ, ముసలోళ్ళనీ, అందర్నీ ఇళ్ళల్లోనుంచి బైటికి ఈడ్చి తన్నారు.

భూ : కడకు ఈ పసిగ్రుడ్డునుకూడ (ఏడుస్తాడు)

రాత్రి : మరి మీ మగాళ్ళంతా గాజులు తొడిగించుక్కూర్చున్నారా?

తా : నేను, తిరగబడి తన్నుదాంరా, అంటే ఈ భూతాలుగాడే వొద్దన్నాడండమ్మా, మహా గాంధీగారైపోయాడా కాసేపూ.

భూ : రాజా గారితో చెప్పిగాని ఏమీ చెయ్యగూడదని అనుకున్నాం.

రాత్రి : ముందు ఆ వెర్రియ్య డాక్టరుగారి దగ్గరకు తీసుకెళ్ళి దెబ్బలు తగిలిన వాళ్ళందరకూ కట్లు కట్టించు.

తా : రండ్రా అందరూ (నిష్క్రమిస్తారు)

రాత్రి : (రాణిని బుజ్జగిస్తూ) ఏ పసువే నీ దవడమీద చెయ్యివెయ్యగలిగింది? భూతాలు, మేం విద్యార్థులం, పొరుగూళ్ళనుంచి వచ్చి ఇక్కడ మకాం వుండి చదువుకొంటున్నాం. ఇలాంటి పెద్ద విషయాల్లో ఏమి చెయ్యగలమో తోచడంలేదు.

భూ : తలుసుకుంటే విద్యార్థులు చెయ్యలేని పనులేమున్నాయి తల్లీ ? ఇక పొరుగూరంటారా, మీరు ఎక్కడ వుంటే అదే మీవూరు.

రాత్రి : విశ్వమూ, రాజా కాలేజీలో వున్నారు. అక్కడ ఆటల పోటీలు జరుగుతున్నాయి. రానియ్యి ఆలోచిద్దాం, రా అమ్మా నీకు కొంచెం కాపడం బెడతా.

(వెళ్ళబోతూంది. అంత ఎదురుగా విశ్వం, రాజా ప్రవేశిస్తారు. విశ్వం కుంటుతుంటాడు. కాలికి కట్టు రాజా చేతిలో దూది, మందు బాటిలు.)

రాజా : మీ అన్నయ్య బంతిని తన్నబోయి, భూదేవిని కౌగిలించు కొన్నాడు.

రాత్రి : (గాబరాగా) ఆఁ ?

విశ్వం : మరేమీ లేదు. మోకాలు కొట్టుకుపోయింది.

రాజా : ఏమిటి భూతాలు, విశేషాలు? అలా వున్నావేం ?

రాత్రి : రాణీముఖం కేసి చూడవేం ?

విశ్వం : ఏమిటి ?

రాత్రి : నీవు ఆటలో పడ్డావు, నీ రాణీ దెబ్బలు పడ్డది.

విశ్వం : ఏమిటి భూతాలు ?

భూ : బాబయ్యా ? (కళ్ళు తుడుచుకుంటాడు)

రాత్రి : వాళ్ల ఖామందు వాళ్లందర్నీ ఇళ్లల్లోంచి లేవగొడుతున్నాడట.

రాజా : అంటే చండభాస్కర్‌గాడి తండ్రా ?

భూ : ఔనండి. ఆ అబ్బాయేనండి రాణిని కొడత.

విశ్వం : (ఉగ్రుడై) ఆరి రాస్కెల్ !

భూ : మాటకు మాట ఎదిరించిందని...

రాజా : అసలు ఎందుకొచ్చిందిదంతా ?

భూ : పోయిన ఎన్నికల్లో కాంగ్రెస్‌కు వోట్లిచ్చినందుకు మా ఖామందు కచ్చ పెట్టుకున్నాడండి. ఆయన పొలంలోనే కదండి మా పేట పేటంతా వుంది ? మొన్న మిమ్మల్ని ఊరేగించి గౌరవించామని ఇక పట్టపగ్గాల్లేకుండా విరుచుకు పడ్డాడండి.

రాత్రి : ఇదంతా ఆ చండామార్కుల తంత్రమే అయివుంటుంది.

విశ్వం : వాళ్ళకి తగిన శాస్తి చెయ్యాలిరా, రాజా !

భూ : భూములు వారివి కదండి.

విశ్వం : (కోపంతో ఎవరి తాతసొమ్ము భూమి ? దున్నేవాడిదే భూమి, దున్నేవాడి సొంతం. భూమినీది, నీ ఖామందుదికాదు. ఒక వ్యక్తి తనసుఖం కోసం మరో వ్యక్తి బ్రతుకు తెరువునే నాశనం చెయ్యడమా ? అన్యాయం.

రాజా : ఎవడి ఇష్టాన్ని వాడు తెలపడానికే వోటు. ఒకడి ఇష్టం ప్రకారం మరొకడు వోటివ్వడం, మిమ్మల్ని ఇళ్ళల్లోంచి లేవగొట్టబూనడం రాక్షసత్వం, దేశసంపదను వ్యక్తుల చేతుల్లో విడవడంవల్ల వచ్చే అనర్థం ఇది. ఈ విషయంలో సాధ్యమైనంతా చేద్దాం. నీవు ఈ డబ్బు (ఇస్తూ) తీసుకుపోయి మీ వాళ్ళ మంచి చెడ్డలు చూడు - పోనీ, నేను వస్తాను పద. విశ్వం ! విశ్రాంతి తీసుకో, రాత్రీ ! రాణీ దవడకు కాపడం పెట్టు.

(ఇద్దరూ నిష్క్రమిస్తారు)

రాత్రి : నేను వేడినీళ్లు సిద్ధం చేస్తాను. (నిష్క్రమిస్తుంది.)

విశ్వం : రాణీ !

రేరా : (ఏడుస్తుంది)

విశ్వం : (బుజ్జగిస్తూ) నిన్ను దవడ మీద గొట్టిన చేతిని విరగగొట్టి తీరతాను. ఇది భీముడి ప్రతిజ్ఞకంటే గట్టిదనుకో, విచారపడకు.

రేరా : విచారమెందుకు లెండి.

విశ్వం : ఏమని ఎదిరించావు వాణ్ణి ?

రేరా : ఇంతమంది మనుష్యుల్ని క్షోభపెట్టడానికి ఒక్క మనిషికి అధికారం లేదన్నాను.

విశ్వం : సత్యమే.

రేరా : ఈ సత్యాన్ని మా గ్రామీణులంతా గ్రహిస్తే ఈ లాంటి పాట్లు తప్పేవి.

విశ్వం : గ్రహిస్తారు. రాణీ, గ్రహించ కేంజేస్తారు ?

రాత్రి : (ప్రవేశిస్తూ) ఇంకా కొంతకాలం పడుతుందేమో గ్రహించడానికి. అందరూ రాణీలాగ చదువుకొని, స్వతంత్రభావాలు అలవరుచు కుంటే, గ్రామాల్లో ధనికవాదం దానికదే నశిస్తుంది. ఇదిగో – నీళ్ళు తయారైనాయి. రండి. లోపలికిరా, అమ్మా ! మీ పల్లెలో లాగా ఇక్కడ విశాలంగా వుండదు.

రేరా : ఎంత విశాలమైన పల్లె అయిన మాకు తలదాచుకోడానికి నీడ కూడ లేదు కదండి.

రాత్రి : భయపడకు రాణీ. నీవు ఈ విశ్వానికే రాణీ కాగలవు. (నవ్వుకొటూ నిష్క్రమిస్తారు. కొంచెం చీకటిగా వుంటుంది. మెల్లగా చండ భాస్కరు, దినం ప్రవేశిస్తారు ఆ వీధిని)

చండ : చూశావురా , దినం ?

దినం : అది కూలీలపిల్లగదా, ఆ విశ్వంగాడి కేమబుద్ధిలేదురా? జాతిని తగలేస్తున్నార్రా వాళ్ళు, మనం ఏమి చేసినా వీళ్లని లొంగదియ్యలేక పోతున్నాం.

చండ : ఆ వూరువాళ్ళని తన్నించినట్టు వీళ్ళనికూడ తన్నించాలిరా.

దినం : వట్టి తన్నించడమే కాదు, గంపల్లో కుండలు పెట్టుకుని అడుక్కు తింటూ పోయేలాగ చెయ్యాలి.

చండ : బలేరా.

దినం : కాని – రాజా గాడు, వీళ్ళూ, ఈ చుట్టుపట్ల గ్రామాలన్నీ తిరిగి ప్రచారం చెయ్యడం మొదలు పెట్టారుగా ? ఏదో నిర్మాణ కార్యక్రమమట – గ్రామాల్ని వీళ్లు ఉద్ధరిస్తారట – ప్రజలంతా సమానమేనట –

చండ : దరిద్రులు, పిల్లీ, ఎలకా సమానమే ? ప్రపంచజ్ఞానం తెలియదు బ్రూట్సు, ఏంరా ? పిల్లీ, ఎలకా ఒకటెలా అవుతాయిరా?

దినం : ఎలా అవుతాయి ? ఒరే - అవుతాయిరో - అవుతాయి !

చండ : ఆc ?

దినం : పిల్లిని ఎలకో, ఎలకని పిల్లో తినేస్తే ఒకటేగా అవడం ?

చండ : పిల్లిని ఎలక ఎలా తింటాదిరా, ఫూల్ ?

దినం : ఏడెలికలు కలిస్తే ఓ పిల్లిని తినెయ్యొచ్చేమోరా !

చండ : మనమే వాళ్ళని తినెయ్యాలిరా.

దినం : ఔన్రా, కాని - విశ్వంగాడు బాగా వున్నవాడేగా ?

చండ : ఏడిశాడు, వుంటేమాత్రం ఈ పద్ధతిలో ఎంతకాల మాగుతారు లేరా, ఇక రాజాగాడు - వున్న నాలుగెకరాలూ అమ్మేశాడు చదువుకోసం. ఊరందరి జీతాలు వాడే కట్టేవాడు. ఇప్పుడు ఈడ్చి తన్నినా ఏగాని కాసులేదు.

దినం : అలాంటి బికారిగాణ్ని పట్టుకుని వ్రేలాడుగూవుంది. రాత్రి దానికేం బుద్ధిలేదురా.

చండ : మనం దాన్ని అల్లరి పెట్టాలిరా.

దినం : ఆc ?

(ఒక ప్రజా సమూహం ఊరేగింపుతో ప్రవేశించి నిష్క్రమిస్తుంది)

చండ : ఒరే ! ఆపేట వాళ్లంతాన్రా ! సర్పవరం వాళ్ళు.

దినం : వీళ్లేదో అల్లరి పెట్టేలాగున్నారు.

చండ : ఏడిశారు. ఇళ్లల్లోనుంచి వెళ్ళగొట్టాంగా ? ఇక్కడినుంచి ఏ చెట్టు నీడనో, అఘోరిస్తారు రేపటినుంచి పనుల్లోకి కూడ పిలవకపోతే ఏ గడ్డితిని బ్రతుకుతారో గాడిదలు, ఆ రాజాగాడు పెడతాడు వీళ్లకిక.

దినం : కాని –

చండ : కానీ లేదు అర్ధణాలేదు. నీవు వెళ్ళి వీళ్ళ సంగతి కనిపెట్టు. రాజాగాడి జాడలుకూడా తీస్తూవుండు. నేను భోంచేసి వస్తా.

దినం : సరే. (ఇద్దరూ చెరోవైపుకి వెళతారు. బాగా చీకటి పడుతుంది. రాజా, భూతాలు, తాతాలు, మరికొందరు ప్రజలు మాట్లాడుకొంటూ ప్రవేశిస్తారు.)

రాజా : భూతాలు ! ఇక ఇండ్లకు పదండి చాల ప్రొద్దుపోయింది.

భూ : చిత్తం మీ మేలు మరచిపోం.

తా : మీరు అంతంత మాటలు అడగకపోతే మాఖామందు లొంగే వాడు కాదు, బాబయ్యా !

భూ : ఒక్కొక్కమాటా ఒక్కొక్క గునపప్పోటు కదండి !

తా : మీకు రేపు ఊరేగింపు ఏర్పాటు చేస్తామంటున్నారు మా వాళ్లు.

రాజా : వద్దు, అలాంటి పిచ్చిపనులేవీ చెయ్యకండి. ఇది మనకు అనుకోకుండా జరిగిన విజయం, స్థిరం కాకపోవచ్చు. ప్రభుత్వానికి వ్రాసి, ఏదో శాశ్వతమైన ఒక ఏర్పాటు చేసుకునే వరకు జాగ్రత్తగా వుండండి.

భూ : చిత్తం, మీ ఆజ్ఞ.

తా : మీరే మాకు దేవుడు. ఏది ఎలా పోయినా, ఎవళ్ళదున్నుకునే భూమి వాళ్లకైపోయే పద్ధతి చెయ్యించండి బాబు.

రాజా : అది తప్పకుండా అవుద్ధి. ప్రభుత్వమే ఆ విషయంలో తగిన చర్య తీసుకుంటుంది. ఈ వేళ జమీందారీలు రద్దుబిల్లు, రేపు భూమినంతా జాతిపరం చేసే బిల్లు, ఎల్లుండి సోషలిజం – తాత్కాలికమైన కష్టాలకు భయపడకండి. ప్రజారాజ్యం దగ్గరలోనే వున్నది. ఇక పదండి.

భూ : చిత్తం, మీరు రోజుకొకసారైనా మావూరు దయచేస్తుండాల.

తా : మీ ఫోటోలు మాకు దయచెయ్యించండి. ఇంటింటా పెట్టి పూజించుకుంటాం.

రాజా : ఇక మీరు వెళ్ళండి. (డబ్బుతీసి) ఇదిగో పోయిన సామానూ అదీ సర్దుకోడానికి-

భూ : వద్దుబాబు, వద్దు అంతకీ వస్తే సంఘంలో డబ్బుందిగదండి.

రాజా : రాణీని చదువు మానిపించకు. ఆమె చాల అదృష్టవంతురాలు అవుద్ది.

భూ : ఆ బాధ్యత అంతా మీదే.

రాజా : ఓ నాచెల్లెలే అనుకుని చదివిస్తాను. ఆ పెద్దకుర్రాళ్ళు నలుగుర్నీ వచ్చేయేడు కాలేజీలో చేర్పిద్దాం. ఇక పదండి.

అందరూ : చిత్తం (నిష్క్రమిస్తారు.)

రాజా : (నిట్టూర్చి) ఆహా ! 

నీతియని, ధర్మమనియు దేనిని ప్రసిద్ధ గ్రంథములు చెప్పెనో – అదికలదు నేడు పాడుపడినట్టి కూలీల పల్లెలందు శ్రమికుడొక్కడె రక్ష లోకమునకు నేడు" (ఆవరణలోని సీడీ మీద కూలబడతాడు. తెరలో పద్యం వినిపిస్తుంది.)

"జగమన్యోన్య విరుద్ధ వస్తువులతో పరిపూర్ణమై యుండియున్,
తగవున్ ధర్మముగల్గి వర్ధిలుట కాధారంబు నీవే గదా ?
పగసాధింతు మటంచు దుర్మదమునన్ పాపాత్మకుల్ రేగినన్
సిగపూవాడగ నీవు సాధులకు తండ్రీ ! భక్త చింతామణీ ! !"

(నిట్టూర్చి భక్త చింతామణీ ! నిరంతరమూ భగవంతుణ్ని స్మరించుకొంటూ, అతడి మీద భారంవేసి జీవయాత్ర దొర్లించే కూలీలకంటే ఇక భక్తు లెవరు ? అట్టిభక్తులకు ధర్మపరులకు నిరంతరమూ చింతను గూర్చే మణివా, భక్త చింతామణీ !

కావడి కుండలందు రిల కష్టసుఖాలను, కాని - ఏలనో
జీవితకాల మెల్లనొక జీవినె కష్టము పెట్టుచున్ మరో
జీవి సుఖించుచున్నది ప్రసిద్ధముగా ! భువికెల్ల తండ్రివౌ
దేవుడవున్నచో చెడుగు దిద్దక చూచుచు కూరుచుండువా ?

వ్యర్థం. ఒక అతీతశక్తిని కల్పించుకొని, భారమంతా అతనిపై నిడి ఊరుకోవడం వ్యర్థం. (ఆలోచనా నిమగ్నుడై యుండగా రాత్రి ప్రవేశిస్తుంది.)

రాత్రి : ఏమో ఇంకా రాజా రాలేదు. ఎట్టి లావాదేవీలలో తిరుగుతున్నాడో? సాలోచనగా ఇటూ అటూ చూచి, ఎవరది ? రాజా !

రాజా : ఔను.

రాత్రి : (సమీపించి) ఎంతసేపైంది వచ్చి ? ఇక్కడ కూర్చున్నావేం?

రాజా : ఇప్పుడే. వాళ్ళని పంపించేసి సృష్టి చిత్రానికి ఆశ్చర్యపడుతూ కూర్చున్నా.

రాత్రి : ఈ రాజకీయాలలో మన చదువేమీ సాగడం లేదు.

రాజా : పరీక్షలుకూడ సమీపిస్తున్నాయి. పోనీ - క్లాసురాకపోతుంది.

రాత్రి : ఎందుకు రాదులే. ఏమిటి నీకు ఆశ్చర్యం కలిగించిన సృష్టి చిత్రం?

రాజా : రాత్రి.

రాత్రి : (చెక్కిలిగిటి) ఒక్క ఆశ్చర్యమేనా, ఆందోళనకూడా కలిగిస్తున్నదా?

రాజా : అమావాస్య అయితేనూ.

రాత్రి : ఇది వెన్నెల రాత్రి

రాజా : ఆనందానికి పునాది రాత్రే.

రాత్రి : అసలు ఆనందమే రాజు కాదా?

రాజా : ..... ..... ....

రాత్రి : అదంతా మామూలే. మరి –

రాజా : ఒక వ్యక్తికి మామూలైనదే మరోవ్యక్తికి తీరని సమస్య కావచ్చు. ఒక కంట నిర్లక్ష్యం చెయ్యబడ్డ ప్రవృత్తే మరోకంట అపూర్వ సౌందర్య శోభితం కావచ్చు. ప్రపంచంచేత అణగద్రొక్కబడిన కార్మికులే ప్రపంచానికి తిండి పెడుతూన్నారు. ఏమంటావు ?

రాత్రి : (కూర్చుంటూ) కానీ –

రాజా : అంతే (అలా కొంతసేపు మౌనంగా కూర్చుంటారు. తెర మెల్లిగా జారుతూ తొంగిచూస్తున్న దినం బుర్రమీద పడుతుంది. అతడు "కంయ్" మంటూ పోతాడు)

# రంగం : 4

(కాలేజీ ఆవరణ. విద్యార్థులు అటూ ఇటూ తిరుగుతూ వుంటారు. దెబ్బకు కట్టు కట్టుకొని దినం ప్రవేశిస్తాడు)

దినం : ఈ డబ్బున్న వాళ్లంతా వట్టి పిరికి పందలు. పైకి మాత్రం మేకపోతుల్లాగ చాపుతారు మోరలు. ఆ చండ భాస్కరంగాడి తండ్రి వాళ్లతో రాజీపడి మా ప్లానంతా చెడగొట్టాడు. ఇప్పు డేమిటి కర్తవ్యం! (బుర్రగోక్కుంటాడు. దెబ్బకు కట్టిన కట్టు చేతిలోకి ఊడి వస్తుంది) ఛీ అబ్బా !

చండ : (ప్రవేశిస్తూ) ఏమిరా, దినం ?

దినం : ఏముందిరా, శ్రాద్ధం.

చండ : మళ్లీ కనిపించావు కాదేం? వాళ్ళలో చేరి పోయావేమో అను కున్నాను.

దినం : ఓరి నీయనుమానం తగులడా ! నా బుర్రపగిలి నే నేడుస్తుంటే –

చండ : ఎవడ్రా కొట్టింది, రాస్కెల్ ?

దినం : స్టుపిడ్ – నన్నెవడు కొడతాడ్రా ? సి.ఐ.డి తనం చెయ్యబోతే సీడీ మెట్టు పొడుచుకుందిరా !

చండ : ఓరి కలియగ ఉత్తరకుమారా ! సీ డీ మెట్టు తగిల్తే పగిలిపోయే తల ఇంకెందుకు పనికొస్తుందిరా ?

దినం : ... ... ... ... ... ... ...

చండ : పోనీగాని – ఏమిటి ఇప్పుడు కర్తవ్యం ? ఎందుకైనా మంచిదని స్టూడెంట్లకు టీ పార్టీ ఏర్పాటు చేశానురా !

దినం : ఎప్పుడు ? నేను లేకుండానే ?

చండ : నువుచస్తే ? నీతో చావమంటావా ? ఈ సాయంకాలమే.

దినం : సరే.

చండ : నీవు వెళ్ళి రాత్రిని తీసుకురావాలిరా.

దినం : సరే.

చండ : కారు వేసుకు వెళ్ళు, అయ్యర్ హోటల్‌కు తీసుకురా.

దినం : సరే (వెళతాడు)

చండ : రాజాగాడిమీద చెప్పవలసిందంతా చెప్పి రాత్రి మనస్సు విరిచేస్తాను. మా జట్టుకు లాగేస్తాను. (తనను పరిశీలించుకొంటూ) ఈ డ్రెస్ బాగుందా ? సిల్కుసూటు వేసుకుంటే? ఈ టై బాగాలేదు. (టై ఊడదీసుకుంటూ నిష్క్రమిస్తాడు. అంత దినం, రాత్రి చెరో వైపు నుంచీ ప్రవేశిస్తారు.)

దినం : హలో --

రాత్రి : దినం ! పిల్చావా ?

దినం : యస్. ఓ. యస్.

రాత్రి : ఏమిటి విశేషం ? కూర్చుందామా ?

దినం : కూర్చోడానికి టైంలేదు. చండభాస్కరరావు నిన్ను తీసుకు రమ్మన్నాడు.

రాత్రి : నన్నా ? ఎందుకు ?

దినం : ఏదో టీపార్టీ ఏర్పాటు చేస్తున్నాడు. కారుకూడ పంపించాడు.

రాత్రి : సారీ. నే నిప్పుడు రాలేను.

దినం : అలాకాదు; రావా లీసారి.

రాత్రి : నేను రాకపోతే మిగిలిపోదుగా ?

దినం : నీవు లేకపోతే అసలు పార్టీ అందమే లేదుగా,

రాత్రి : మా అన్నయ్యకు చెప్పారా ?

దినం : ఏమో - ఆc చెప్పారు. చెప్పారు.

రాత్రి : ఎక్కడ కనిపించాడు?

దినం : హోటల్లో వున్నాడు.

రాత్రి : మా అన్నయ్య హోటలుకు వెళ్ళడు.

దినం : నాతో చెప్పిపంపించాడు, నిన్ను అర్జంటుగా తీసుకురమ్మని.

రాత్రి : నేను రాలేనన్నానని చెప్పు.

దినం : రాక తప్పదు.

రాత్రి : ఏమిటా బలవంతం ?

దినం : బలవంతమే.

రాత్రి : అంత మగాడివయ్యావే ?

దినం : నిన్నిప్పుడే కార్లో కూర్చోబెట్టి తీసికెళతాను (చేయిపట్టుకుంటాడు)

రాత్రి : ఫూల్ ! (చాచి ఒక్క చెంపకాయ కొడుతుంది. దినం గిర్రున తిరిగి నేల కొరుగుతాడు. రాత్రి వెళ్ళిపోతుంది. కొంచెం సేపటికి దినం లేస్తాడు. రాజా ప్రవేశిస్తాడు)

రాజా : అదేమిరా దినం ?

దినం : (దులుపుకొంటూ) కళ్లు తిరిగిపడ్డానురా.

రాజా : రాత్రి ... ... ... ...

దినం : (కంగారుగా ) క్షమించరా, రాజా !

రాజా : రాత్రి తెల్లవార్లూ చదువు కున్నావు కాబోలు. పరీక్షలొస్తున్నాయిగా !

దినం : (నిట్టూరుస్తాడు)

రాజా : కూడా రానా ?

దినం : అక్కర్లేదురా వెడతా.

రాజా : సరే (నిష్క్రమిస్తాడు అంత చండ భాస్కర్ ప్రవేశిస్తాడు ముస్తాబై)

చండ : ఏమిరా ?

దినం : రాజాగాడు రానిస్తాడట్రా ? పాపం ఆమెకు రావాలనే వుందిగాని -

చండ : (ఉత్సాహంతో) నిజం ?

దినం : నేను కనిపెట్టానుగా !

చండ : అయితే కర్తవ్యం ?

దినం : దాన్ని రాజాగాడి స్నేహం నుంచి తప్పించాల. అందుకు కొన్ని బూతులు కాలేజి గోడలమీద వ్రాయాల.

చండ : రైటో, కానీ - తర్వాత --

దినం : తర్వాత - ఆలోచిద్దాం.

చండ : రాత్రి--

దినం : (ఉలిక్కిపడతాడు)

చండ : రాత్రి సర్పవరం వెళదాం.

దినం : ఏటుపడివున్న పెద్దపులుల మధ్యకు--

చండ : భయంలేదు లేరా, మా జవానుల్ని కూడ తీసుకెళదాం పైగా - నీ ఉపదేశమేగా, ప్రజల్లో విషప్రచారం చెయ్యాలని.

దినం : నిజమే. కాని ప్రస్తుతం ఆ ప్రజలు...

చండ : నిన్న పదిరూపాయలిచ్చినవాడి కంటే ఈ వేళ ఒక మిఠాయి కొమ్ము చేతబెట్టినవాడే అభిమానపాత్రుడురా ప్రజలకు కాదూ?

దినం : ఔననుకో --

చండ : ఈ టీ పార్టీ త్వరగా ముగించేసి వెళదాం పద. టీ పార్టీ పేరు చెప్పినప్పటినుంచి చాలమంది విద్యార్థులు అప్పుడే మనప్రక్క వచ్చేస్తున్నారురా!

దినం : కొంచెం ధారాళముగా ఖర్చుపెట్టాలికూడాను.

చండ : ఓ దివ్యంగా (ఇద్దరూ నిష్క్రమిస్తారు. కొంచెం సేపటికి తెరలేస్తుంది. అది సర్పవరం, రాత్రిపూట భూతాలు ఇంటిముందు రేరాణి ఒక పుస్తకం చేతబట్టిపాడుతూ వుంటుంది).

రేరా : (పాట)

పగలనక రేయనక
పాటుపడి పండించి

ప్రజల కందిస్తారు మారైతు
ప్రాణమర్పిస్తారు మాకూలి

భూదేవి సేవించి
శ్రీదేవి చేస్తాడు

పరుల కర్పిస్తాడు మారైతు
పస్తుపడుకుంటాడు మా కూలీ

నేల దున్నేవాడ,
నేల పాలించరా !

హాయిగా బ్రతకరా మా రైత !
అభివృద్ధి పొందరా మా కూలీ !

(ప్రవేశం - భూతాలు)

భూ : ఏం పుస్తకమమ్మా అది ?

రేరా : బలేబొమ్మల పుస్తకం నాన్నా! దీనిపేరు బాల. బలే పాటలున్నాయి. రాత్రి కొనిపెట్టింది.

భూ : "రాత్రి" కాదు – రాత్రమ్మగారు అనాలి.

రేరా : అబ్బే. 'రాత్రి' అంటేనే అ పేరు అందం. రాత్రమ్మగా రేమిటి రాత్రమ్మగారు, రాణమ్మగారు, సీతమ్మగారు (నవ్వుతుంది)

భూ : సీతమ్మగారనడంకూడ తప్పే ?

రేరా : "అమ్మగారు" లాంటి గౌరవపదాలు అసలు పేరు అందాన్ని, గౌరవాన్నీ పాడుచేస్తాయట నాన్నా !

భూ : ఎవరు చెప్పారు, తల్లీ ?

రేరా : విశ్వంగారు చెప్పారు.

భూ : ఏమో నాకు తెలవదు. ఆ బాబులే మనపాలిట దేముళ్ళు. లేకపోతే మనం ఈ పాటికి ఏ చెట్టుక్రింద చస్తూవుండేవాళ్ళమో.

రేరా : రాజాగారు దేవుడు లేడంటారు నాన్నా ! నిజమే. దీన ప్రజలకు తోడుపడే వారికంటే మరి దేవుడెవరు ?

భూ : దేవుడు లేడనడం తప్పమ్మా. వారంటే అన్నారు, నీవు మాత్రం అనకు.

రేరా : వారికంటె మనం తెలిసిన వాళ్ళమా ?

భూ : కాదనుకో, అయినా---

రేరా : దేవుడనేవాడే ఒకడుంటే లోకంలో ఇంత అన్యాయం వుండదు నాన్నా!

భూ : .... .... ..... ...

రేరా : ... .... .... ....

భూ : (ఏదోవిని) అదిగో. ఏదో సందడిగా వుందే పేటలో! నీవు ఇంట్లోకి పద. ఆ బట్టలు అలా మాపెయ్యకు.

రేరా : అసలు ఇవి ఇదే రంగు. మంచిబట్టలు ఇంకా కుట్టించి ఇస్తానన్నది రాత్రి.

భూ : వారిస్తామంటే మాత్రం మనం పుచ్చుకోవడం ధర్మమా? కష్టపడకుండా వచ్చిన సంపద విషంతో సమానం.

రేరా : మరి, ఈ భాగ్యవంతులందరి మాటా ?

భూ : అందరికీ అంతే.

రేరా : అయితే ఈ ఖామందులు తింటున్నదంతా విషమేనా ?

(అంత తాతాలు వస్తాడు)

తా : రాణీ పెళ్ళికూతురైందే ! సీమరాణి లాగుందిరా ! గాంధీగారి బట్టలా ఏమిటవి ?

భూ : ఆс. అవే అనుకుంటాను.

తా : మనం మొయ్యలేంరా, బాబూ, ఆ గోనెగుడ్డల్ని.

రేరా : ఇవి గోనెగుడ్డలా ? (తాతాలు దగ్గరకు వెళుతుంది)

తా : (చూచి) ఒరే ! భూతాలు ! ఎంత నాజూకుగా వున్నాయిరా ! !

భూ : అదే, సీమగుడ్డల్ని మించివున్నాయి. ఔనుగాని, ఆ సందడేమిటి?

తా : మరేరా ! మన ఖామందుగారబ్బాయి వచ్చాడు.

భూ : (లేస్తూ) ఆс ! మళ్ళీ ఏమివచ్చిందోరాబాబు, కొంపమీదకు?

తా : అదిగో ఈ దార్నే వస్తున్నారు.

రేరా : (నిష్క్రమిస్తుంది)

తా : పద - ఎదురు వెళదాం.

(అంత చండభాస్కర్, దినం ప్రవేశిస్తారు)

భూ : (కంగారుగా) దండాలు బాబయ్యా ! ప్రభువులు రక్షించాలి.

చండ : కూర్చోండోయ్ ! కూర్చోండి. మీకేమీ ఫర్వాలేదు. కూర్చోండి.

తా : (నిట్టూర్చి) అమ్మయ్య,

దినం : ఏమోయ్, అబ్బీ ?

భూ : మళ్ళీ ఏం కొంపలుమునుగుతాయో అని ఊపిరి బిగబట్టు క్కూర్చున్నాం, సామీ !

చండ : బుద్ధి తెచ్చుకుంటారని ఊరికే అలా జడిపించాం మొన్న. అంతే, మీరేమీ భయపడకండి.

దినం : అందుకే మొన్నటినుంచీ అబ్బాయిగారికి మీ ఆలాపనే. ఈ వేళకు గాని తీరిందికాదు.

చండ : అదే. ఎలావుంటున్నారో, పాపం, చూచిపోదామని వచ్చా.

తా : ఏమో – ఆ రాజాగా రుండబట్టిగాని –

చండ : వాడా ? రాస్కేల్, వాడొక గడ్డి పరకతో సమానం. మీ ప్రజలకు బుర్రల్లేవురా. వాడొకందుకు మీవూరు వస్తున్నాడు. మీ రేదో దేవుడనుకుంటున్నారు.

దినం : వాడి దుర్మార్గం సంగతి మనకెందుకులేరా. ఎక్కడ అగ్గివుంటే అక్కడే కాలుతుంది.

భూ : రాజాగారి సంగతేనాండి; మీరంటున్నది? ఏమైనాసరే, ఆ బాబుల గురించి మీరు చెడ్డగా మాట్లాడగూడదు.

చండ : వాడి సంగతి నాకు తెలియదంటావా ?

తా : ఆయన్ని చెడ్డవాడంటే మేం ఓర్చుకోలేం.

దినం : మనకెందుకులేరా, పోనీ.

చండ : ఘంచివాళ్ళకోసం మీరు ప్రాణాల్నికూడ ధారపొయ్యడంలో అర్థముంది. కాని ఈ కొరవితో నెత్తిగోక్కోవడం ఏమిటి?

భూ : మాకు ఆయనలో అంత విశ్వాసం కుదిరిందండి.

దినం : పాలు తాగి రొమ్ము గ్రుద్దేవాళ్ళంటే మీకు విశ్వాసం !

భూ : ఎందుకు వచ్చిన మాటలండి అబ్బాయిగారు అవి ?

చండ : సరే నీకో కూతురుందా ?

భూ : ఆc ?

చండ : ఆ పిల్లని తరచు వాళ్ళదగ్గరకు వెళ్ళనియ్యకు, నీది గౌరవంగల కుటుంబం.

తా : అగ్గికి చెదపట్టదండి, బాబు !

దినం : సూర్యుడిక్కూడా పుప్పి పడుతుందీ రోజుల్లో.

చండ : ఒరే మీ కిక్కడ రామాలయం వుందా ?

తా : ఏదో పాడైపోయి వుందండి.

చండ : రేపు మీకొక క్రొత్తగుడి కట్టిస్తాను. ఇప్పుడేమన్నా డబ్బు కావాలా?

తా : ఎందుకండి ?

దినం : ఎందుకన్నా ?

తా : (భూతాలు వంక చూస్తాడు)

భూ : (తలెత్తకుండానే) అక్కర్లేదండి, బాబు.

చండ : కావలిస్తే తీసుకొండి.

దినం : అక్కర్లేకపోతే రేపు కాఫీహోటలుకు మిగుల్తుంది.

చండ : అయితే, మేం వెళతాం.

దినం : రేపు మళ్ళీవస్తాం.

చండ : రోజూ వస్తూనే వుంటాం.

దినం : మిమ్మల్ని ఉద్ధరించడానికి.

చండ : నేను తలచుకొంటే నిమిషాలమీద ఉద్ధరిస్తాన్రా మిమ్మల్నందర్నీ.

తా : చిత్తం. చిత్తం.

చండ : వాళ్లతో మాత్రం జాగ్రత్తగా మెలగండి.

దినం : మీకింకా నమ్మకం లేకపోతే, రేపు ఆ కాలేజీ గోడలమీద చూడండి. మీ రాజాగాడి పరువు కనిపిస్తుంది.

చండ : ఆ పాడుగొడవంతా మనకెందుకులేరా, పద.

(నిష్క్రమిస్తారు)

తా : చూచావట్రా భూతాలు !

భూ : (అవమానితుడులా వుంటాడు)

తా : ఉద్ధరిస్తారట మనల్ని.

భూ : ఇప్పటివరకూ ఉద్ధరించింది చాల్లే.

తా : అయినా -- ఆ డబ్బు పుచ్చుకోవలసిందిరా !

భూ : అది విషంరా. అది అంటినచోటెల్లా తగులడద్ది.

తా : ఆఁ నీదంతా పిచ్చి. కాని - ఆవిషయంలో జాగ్రత్తగానే వుండాలిరా.

భూ : ఏ విషయం ?

తా : ఈడువచ్చిన పిల్లని అలా ఆ చదువుకునే కుర్రాళ్లతో వొది లెయ్యడం--

భూ : నువ్వా అంటున్నావురా, ఆ మాట ? రాజాగారు రాణీని సొంత చెల్లెల్లా చూచుకుంటారురా.

తా : కుర్రగాళ్ల బుద్ధులు వరద పొల్లులురా, ఎప్పటికే రూపం దాలుస్తాయో చెప్పలేం. (ఆలకించి) అదిగో విను. ఎందుకా పాటలు, ఆటలూ మనకి?

భూ : (బెంగతో అలాగే చతికిలపడతాడు)

తా : నే వెళ్ళివస్తా, (వెళతాడు, ఇంట్లో రేరాణి పాడుతున్నపాట వినిపిస్తూనే వుంటుంది. మెలమెల్లగా తెర జారుతుంది. పాట గాల్లో తేలిపోతుంది. ఈ విధంగా--

"త్వమపి మమ భూషణం
త్వమపి మమ జీవనం
త్వమపి మమ భవజలధి రత్నం"

## రంగం : 5

(కాలేజీ ఆవరణ. వీధిని పోయే ప్రజలూ, విద్యార్థులూ ఆగుతూ, గోడలమీద చదివి ఛీ ఛీ అనుకొంటూ పోతూవుంటారు. తర్వాత చండభాస్కరుడు, దినం ప్రవేశిస్తారు)

చండ : బలేగా రాశావురా, దినం ! ఒరే, ఆ కనపడే డాబాగోడమీద కూడా రాయలేకపోయావురా, బాగా కనబడును .

దినం : అందింది కాదురా.

చండ : ఏడిశావు. ఇదేమిటీ గోడమీద ? (చదివి) తక్కింది కూడ పూర్తి చెయ్యవలసింది.

దినం : పూర్తి చేద్దునురా. 'అంతట్లో ఒక కుక్క భొయ్‌మంది. దాంతో ఆ సైడు కాల్వలో పడ్డాను. ఇదంతా కొట్టుకుపోయిందిరా (చూపుతాడు)

చండ : తగినపని చేశాంరా. ఇక ఆ ఇద్దరూ విడిపోయి, ఒకళ్ళనొకళ్ళు కొట్టుకు చస్తారు.

దినం : ఈ దెబ్బతో రాత్రి చదువు మానుకు పోతుందిరా.

చండ : ఆc. ఇంతమాత్రం దానికే ? రాజా గాడికీ, విశ్వంగాడికీ చెడిపోతుంది.

దినం : రాత్రి ఇక ఈ కాలేజీలో అడుగుపెడితే నన్నడగరా.

చండ : అయితే మనకేం లాభం ?

దినం : వాళ్ళు చెడిపోవడమే మనకు లాభం.

చండ : వాళ్ళమాట కాదు నే నడిగేది. రాత్రిమాట.

దినం : రాత్రి కూడ.

(గోడలకేసి చూచుకొంటూ తాతాలు ప్రవేశిస్తాడు)

చండ : ఏమిటిరా అబ్బీ, చూస్తున్నావు ?

తా : ఏ తుంటరులో ఈ చక్కని గోడలన్నీ చెరిపేశారని చూస్తున్నానండి, బాబు !

దినం : నీకు చదువొచ్చునా ?

తా : ఏదో వానాకాలపు చదువండి.

చండ : అయితే ఇది చదువు (ఒకచోట చూపుతాడు)

తా : (చదివి) ఛీ, ఛీ. మనుషులా, పశువులా అండిబాబు, ఇది రాస్త?

చండ : (కోపంతో) వ్రాసిన వాళ్ళ నెందుకురా, తిట్టడం ? అసలు ఉన్న దున్నట్టు రాశారు.

దిన : మీ నాయకుడు రాజాగాడి ఘనత ఇలావుంది.

చండ : ఆయన గురించి ఆయనే రాసుకుంటాడా ఈ పచ్చిబూతులు ?

దినం : గొప్పకోసం.

చండ : పది నీతులు – పదిబూతులు, ఏవి తేలికైతే అవి, ప్రచారమైతేనేగా, నాయకత్వం?

తా : కలికాలం !

చండ : అంతే, అంతే, మీ భూతాలు కనబడ్డం లేదేం ?

తా : వూరెల్లాడండి.

చండ : నీవు మళ్ళీ ఎప్పుడు తిరిగొస్తావు ?

తా : రేపండి.

చండ : దారిఖర్చు వుందా ? పోనీ ఇది తీసు కెళ్ళు (రూపాయి ఇస్తాడు)

తా : (వద్దంటూనే తీసుకుంటాడు)

చండ : సరే వెళ్ళిరా.

తా : చిత్తం (వెళ్ళిపోతాడు)

చండ : మనం వాళ్ళ పేట కెళితే ఈ సాయంకాలం ?

దినం : అదే ఆలోచిస్తున్నా. రాత్రికి వెళితే ?

చండ : మధ్యాహ్నమే వెళదాం. ఆ మామిడితోటలో మకాం వేదాం. కాలేజీ లేదుగా ఈ వేళ.

దినం : వుంటే మాత్రం మనకు అడ్డువచ్చి చచ్చిందా ఏమిటి?

చండ : రాణి ఒక్కర్తే వుంటుంది.

దినం : అందుకే పద (వెళతారు అంత రాజా ప్రవేశిస్తాడు)

రాజా : (గోడలు చూస్తూ, విచారంగా) ఎంత దుర్మార్గం ! ఇక రాత్రి మొగం ఎలా చూడగలను ? కాలేజీలో – మిత్రుల ఎదర, ఉపాధ్యాయుల ఎదర, ఎలా తలెత్తుకోను ! ఈ దుష్ట ప్రపంచములో బ్రతికేకంటే చావు మేలు కాదా ? ఈ అవమానం, అపఖ్యాతి ఎలా పోగలదు. చదువుకి స్వస్తి చెప్పి ఇంటికి పోనా? మంచివాళ్ళను హింసపెట్టే ఈ దుర్మార్గం శిక్ష లేకుండ విచ్చల విడిగా ఇలా సాగవలసిందేనా? (తలవంచుకొని పోతాడు, అంత రాత్రి ప్రవేశిస్తుంది)

రాత్రి : (కన్నీరు గోటమీటుతూ) ఈ దుర్మార్గానికి పాల్పడ్డవాళ్ళు నాశనమై పోక తప్పదు. ఎంత నీచమైన బూతులు ! ! అయ్యో ! లోకం ఏమను కొంటుంది ? ఇక తలెత్తుకొని ఎలా తిరగను ? పౌరుష వంతుడు అన్నయ్య, అభిమానధనుడు రాజా ఏమనుకుంటారు ? ఇక కాలేజీకీ, నాకూ సరా ! (వెక్కి వెక్కి వచ్చేఏడ్పు ఆపుకుంటూ) ఓ నరపశువులారా ! మీకన్న అసలు పశువు లెంత నయం ! (కళ్ళు తుడుచుకొంటూ నిష్క్రమిస్తుంది. అంత విశ్వం ప్రవేశిస్తాడు.)

విశ్వం : (ఆశ్చర్యంతో) ఏమిటీ ప్రళయం ? ఆc ! ! రాజాకు, రాత్రికి ? ? వాళ్ళిద్దరూ స్నేహితులే. అది నాకు తెలుసు. ఈ వేసవిలో పెండ్లి చెయ్యడానికి ఏర్పాట్లు కూడా జరుగుతున్నాయి. అయితే, ఇలా రాసెయ్యడమే ? ఇన్నిన్ని అబద్ధాలు ఇలా ప్రచారం కావలసిందే ? నీతి నియమాలు లేకుండా విద్యార్థులిలా నాశనమై, పశువులై పోవలసిందే ? విద్యార్థులందరినీ అనడమెందుకు ? ఆ ఇద్దరు గాడిదలే ఈ పని చేసి వుంటారు. ఛీ, గాడిదలు ఇలాంటి పాడుపన్లు చెయ్యవు, వాళ్ళు అడ్డ గాడిదలు. ఈ వ్రాత దినంగాడిదిలా కనిపిస్తూంది. ఇక వీడి దినాలు దగ్గర పడ్డట్టే. (కోపంతో నిష్క్రమిస్తాడు. అంత తెర లేస్తుంది. సర్పవర సమీపంలో మామిడితోట, సాయంకాలం, పుస్తకాలు చంకన పెట్టుకొని చండభాస్కరుడు, దినం ప్రవేశిస్తారు)

చండ : ఒరే – ఇంత మంచి ప్లేస్ ఇంతవరకు మనం చూడకపోవడ మేంట్రా?

దినం : చూసే వుంటాంరా, జ్ఞాపకంలేదు.

చండ : ఇక్కడికి రోజూ మనం చదువుకోడానికి రావచ్చు. మంచి మంచి ఆడపిల్లలు కనిపిస్తారు.

దినం : మన కాలేజీ గరల్సు కంటేనా ?

చండ : ఏం కాలేజీగరల్సురా ! ఒక్కళ్ళ ఒంట్లోనూ జీవం ఉండదు. ఈ పల్లెటూరి పిల్లలు చూడు. ఎంత కమ్మగా వుంటారో !

దినం : అదేలే, వీళ్ళు పొలాల్లో పనిచేస్తారు. శరీరం చక్కగా ఎదిగి సొగసుగా నిగనిగలాడుతూ వుంటారు.

చండ : ఈ చెరువుకే నీళ్ళకొస్తున్నట్టుంది. ఆ పిల్ల ఎవరో, చూడ్రా,

దినం : (చూచి) బలే ! అదేరా రాణి.

చండ : (చూస్తూ) నిజం నిజం ! ఒరే, మనం నక్కను తొక్కి వచ్చాంరా.

దినం : తొక్కడవేంటి – చితకతొక్కి వచ్చాం ఇప్పుడు కర్తవ్యం ?

చండ : నువ్వు దాక్కో. నేను మాట్లాడతాను. వ్యవహారం సాఫీగా వుంటే సరే లేకపోతే నేను సైగ చేస్తాను. నువ్వు ముసుగేసుకొచ్చి దాన్ని ఎత్తుకుపోవాలి. వెనక నే వస్తా. తెలిసిందా ? ఊ, దాక్కో.

దినం : ఈ చెట్టు చాటున వుంటా. (వెళతాడు. చండభాస్కరు పుస్తకం విప్పుతూ, చూస్తూవుండి – కూనిరాగం తీస్తూ – ఆమె కనిపించకుండా ప్రక్కకి ఒరుగుతాడు. అంత బిందె చేతబట్టుకొని రేరాణి ప్రవేశిస్తుంది ఏదో పాడుకుంటూ, వాళ్ళెవళ్లని చూడదు)

రేరా : (పాట)

కోకిలమా ! ఓహో, కోకిలమా !
వచ్చితివా ముచ్చటగా ! !

ముందుగ నీ పిలుపులు వినిగానీ
రాడా మాధవుడు ? ?

వసంతవేళా వైతాళికుడా !
ధన్యుడవోయీ నీవు ;

పురోగామియే పురుషాగ్రణికీ
పుణ్యము లేదేమో !

స్వేచ్ఛాజీవి ! విహరింపుము, మా
బానిస బ్రతుకులు తరియింప;

పాల్గొనలేవో ప్రత్యక్షముగా,
ఆనందింతును చూచి

(అంత చండభాస్కరు ఎదరకు వస్తాడు)

చండ : ఆహా ! ఓహో !

ఏమి కంఠము ! ఏమిరాగమే !
సెమియాపాయసము ! !
పాడిందంతా పాయసమేనే
పాయసమంతా నాదేనే

నీవు పాట పాడుతుంటే నామనస్సు పెనంమీద పెసరట్టులాగా వేగి పోతున్నదే రాణీ !

రేరా : (సిగ్గుతో నీళ్లు ముంచుకు పోతున్నది)

చండ : అయ్యో ! ఆగవే కొంచెం. నేను మీ ఖామందుగా రబ్బాయి గార్ని.

రేరా : (మాటాడకుండా పోతున్నది)

చండ : ఇదిగో – మర్యాదగా చెపుతున్నాను.

రేరా : (మౌనంగానే నిష్క్రమిస్తుంది.)

చండ : అరే ! ఈ కాలంలో మర్యాదకు చోటులేదు. (వెనుక నిష్క్రమిస్తాడు. వెనుకనుంచి దినం ప్రవేశిస్తాడు)

దినం : ఏమిటి ! వీళ్ళు ఒకళ్ళవెంట మరొకళ్ళు పోతున్నారే ! ఆ పిల్ల ఒప్పుకుందో ఏమో ! ఇంటికి రమ్మన్నది కాబోలు ! అయితే నేను ఈ చెట్టుచాటున ఏడవవలసిందే ? చాటు చాటుగాకూడా వెళతాను. – ఛాన్సు. (నిష్క్రమిస్తాడు. వెనుకనుంచి రేరాణి, కొంచెం ఎడంగా చండభాస్కరు ప్రవేశిస్తారు)

చండ : ఇదిగో ! ఆఖరుసారి అడుగుతున్నాను.

రేరా : (మౌనంగా పోతూనే వుంటుంది)

చండ : మౌనం అర్ధాంగీకారమా ? (చెయ్యి పట్టుకుంటాడు. రేరాణి బిందె దింపుకొని చాచి ఫెడేలున కొడుతుంది. అతడు గిర్రున తిరిగి పడబోయి ఆపుకొని) ఛీ తాటకీ ! నీ మొగుడు రాజా గాడొస్తున్నా డుండు. (అంత దినం ముసుగుతో ప్రవేశిస్తాడు. అప్పటికే రేరాణి బిందె ఎత్తుకొని మళ్లీ కొంతదూరం పోతుంది. దినం ప్రవేశించి కంగారుగా ఆమెను బిందెతోనే ఎత్తుకోబోయి, అమాంతంగా క్రిందపడతాడు. అప్పుడు రేరాణి పెద్ద వెర్రికేకలు వేస్తుంది అన్నా అంటూ)

దినం : (లేచి దులుపుకుటూ) నిను విడిచిపెడతానా, రా.
(మళ్లీ ఎత్తుకోబోతాడు)

చండ : వాళ్ళెవరో వస్తున్నారు. పారిపోరా.

దినం : వస్తే రానీరా, (ప్రయత్నం మానడు)

చండ : ప్రమాదంరా పారిపోరా గాడిద (తన్ని తోసేస్తాడు)

రేరా : నాన్నా ! నాన్నా ! (కేకలు వేస్తుంది). అంత కొంత మంది ప్రజలు ప్రవేశిస్తారు. తర్వాత భూతాలు ప్రవేశిస్తాడు)

భూ : ఏమిటమ్మా ?

రేరా : (సొమ్మసిల్లి పడిపోతుంది)

భూ : అయ్యో ! (మెల్లిగా పరుండబెట్టి) ఏంజేశావురా పిల్లని ? (చండ భాస్కరుని మీదికి కర్రెత్తుతాడు)

చండ : రక్షించడానికి వచ్చిన నన్నా మీరు అనడం ?

భూ : ఆఁ ?

చండ : ముందు అమ్మాయిని చూడండి. తర్వాత చెపుతాను కథంతా.

భూ : ఇప్పుడు చెప్పండి. (కొందరు రేరాణిని తీసుకుపోతారు)

చండ : మేము ఈ తోటల్లోకి ఎప్పుడూ చదువుకోడానికి వస్తాం. ఈ వేళ ఈ గమ్మత్తు జరిగింది.

భూ : ఏమిటో త్వరగా చెప్పండి.

చండ : ఆ రాజాగాణ్ణి నమ్మవద్దని ఎన్నిసార్లు చెప్పాన్రా నీకు ?

భూ : నమ్మితే ?

చండ : వాడే ఈ తుంటరిపని చేసింది.

భూ : (చకితుడై) ఆఁ !

చండ : పాముకు పాలు పోశాన్రా మీరు. అడుగో అలా పారిపోతున్నాడు చూశారా ? (దూరంలో చూపుతాడు)

భూ : (కోపంతో) వాడే ? నిజమే ? పట్టుకోండ్రా !

(కొందరు పరుగెత్తుతారు)

చండ : నేర్పుకుంటే మాన్పుకోవడం కష్టంరా.

భూ : గాడిద కొడుకు ఎంతపని చేశాడు ! మీరు దేవుడులాగా రాబట్టి గాని, లేకపోతే -

చండ : వాడంటే మీకిష్టమేగా.

భూ : ఇష్టమా ? వాణ్ణేమి చేస్తానో చూశారా మరి? రక్తంబొట్టు పెట్టుకొకపోతే నన్ను మారు పేరుతో పిలవండి.

చండ : సంఘాలు స్థాపించి, ఆ సంఘాల్లో డబ్బు చెక్కెయ్యడం - అందమైన ఆడపిల్లలుంటే పాడుచెయ్యడం - ఈ రెండూ లేకపోతే ఎవడికి పట్టిందిరా ప్రజాసేవ ?

భూ : (సిగ్గుతో తలవంచుకుంటాడు)

చండ : ఇంట్లో కూర్చుని తన పనేదో తాను చేసుకుపోయేవాడే నిజమైన సంఘసేవకుడు. నేనమ్మా అని బహిరంగంగా తిరిగేవాడు సంఘానికి ఉపకారం కంటే అపకారమే ఎక్కువ చేస్తాడు. ఏమంటావు?

భూ : అంతే అనుకోవాలి. కాని – రాజా ఇంత పశువైపోతాడని అనుకోలేదు.

చండ : ఎవరూ అనుకోలేదు. కలలోకూడా అనుకోలేదు. కాని – చూశావా – చిన్నప్పుడు చదువుకున్నాం – "ఎంత చదువు చదివి, ఏ నీతి విన్నను, హీను డవగుణమ్ము మానలేడు" అని అదీ కారణం ఇలా జరగడానికి. ఇంకా – ఆ వీధుల్లో వీడి గురించే ఎలా వ్రాసేశారో చూశావా? విశ్వంగాడిచేత తన్నులు తిని వాళ్ళ ఇంటికి వెళ్ళడమే మానుకున్నాడు. ఆ యాట కట్టింది. ఈ యాట మొదలెట్టాడు. కుక్కబుద్ధి ! నాకెందుకు నేపోతా (నిష్క్రమిస్తాడు)

భూ : (తెప్పరిల్లి) పగ సాధించాలి. నాయింట తిని, నాయింటి వాసాలు లెక్కపెట్టడానికి వాడి కెన్ని గుండె లున్నాయి ! (క్రర భుజాన్ని పెట్టుకొని బైలుదేరతాడు)

(తెర)

## రంగం : 6

(విశ్వం గృహోపకంఠం, రాత్రి దీనతతో విచారిస్తూ ప్రవేశిస్తుంది)

రాత్రి : (పాట)

కిట్టనితనమా ! గట్టు తెగినదా ?
కొట్టుకపోవునా లోకం ! !
మానవధర్మము మన్నుగలిసెనా
మంచికి రోజులు కావా ?

పగటిదొంగలే ప్రజానాథులా ?
రౌడీదేనా రాజ్యం ?
ఏమోయీ ప్రభు ! ఏమీ న్యాయం ?
ఎవడీ సృష్టికర్త ? ?

మాయెరుగని ఈ మానిగున్నకా ?
కొమ్మలు విరచే ఘోరతుఫాను ?
క్రూరమైన పులికోరలనుండి
లేడికి రక్షణ లేదా ? ?

(మనో వ్యథతో రెండు చేతుల్లోను తలపెట్టుకొని దాపునవున్న కుర్చీలో కూలబడుతుంది. అంత తెరలో పద్యం వినిపిస్తుంది.)

"ఏనుం గెక్కినవాడు కుక్కలకు దా నేరీతిగా జంక, క
త్యానందమ్మున నేగునో, అటె తనూయాత్రన్ జగన్నాథు ని
న్నే నిక్కంపు సహాయముగా గొనునరుండే యాపదల్ వచ్చినన్
కానిన్ లక్ష్యము చేయ డించుకయు దేవా ! భక్త చింతామణీ !"

భక్త చింతామణీ ! భక్తులకు చింతను కూల్చే మణి కావచ్చు. చరిత్ర చూచినా,

మరే ఇతిహాసం చూచినా, ఏ భక్తుణ్ణి సుఖపెట్ట గలిగాడు మన భక్తచింతామణి ? రాజా చెప్పినట్టు లేనివాణ్ణి వున్నాడనుకొని అవస్థపడడం తప్ప మరేమీలేదు. లేకపోతే ఈ అన్యాయాలేమిటి? (అంత విశ్వం ఒక వార్తా పత్రికతో ప్రవేశిస్తాడు)

విశ్వం : ఏమిటీ ప్రళయం ! ఈ రౌడీయిజానికొక అవధి అంటూ లేదా? రాత్రి ఏమనుకుంటుందో పాపం (చూచి, పత్రికో ఆమె మీదికి విసిరి, బెంగతో కూర్చుంటాడు)

రాత్రి : (పత్రిక విప్పి, అటూ ఇటూ తిరగవేసి, ఏదో చదివి తెల్లబోతుంది) ఆఁ !

విశ్వం : చెల్లీ ! చదివావా పత్రికావార్త ?

రాత్రి : ... .... .... .... .... ....

విశ్వం : ఏదీ పేపరు (తీసుకుని పైకి చదువుతాడు)

"కా లే జీ వి ద్యా ర్థి దౌ ర్జ న్య ం"

"రాజా అనే కాలేజీ విద్యార్థి రాత్రి అనే విద్యార్థినితో అవినీతిగా ప్రవర్తించడంవల్ల ఆమె అన్న అతణ్ని తన్ని తగిలేశాడు. తర్వాత అతడు సర్పవరం రాణి అనే పిల్లను బలవంతం చెయ్యగా చండభాస్కరావు అనే మరొక విద్యార్థి నాయకుడు ఆమెను రక్షించాడు, రాజా పరారీ అయినాడని వదంతి"

రాత్రి : (కన్నీరు కారుస్తుంది)

విశ్వం : (పేపరు గిరాటు వేస్తూ) ఏమంటావు చెల్లీ ?

రాత్రి : ... .... .... .... .... .... ... .... .... .... .... .... ... .... .... .... .... ....

విశ్వం : మనం కాలేజి మానేసి ఇంటికిపోదాం.

రాత్రి : (వెక్కి వెక్కి ఏడుస్తుంది)

విశ్వం : ... .... .... .... .... .... ... .... .... .... .... .... ... .... .... .... .... ....

రాత్రి : ... .... .... .... .... .... ... .... .... .... .... .... ... .... .... .... ....

విశ్వం : (కళ్ళు తుడుచుకుంటూ) ఏమంటావు ?

రాత్రి : (సముదాయించుకొని) సరే.

విశ్వం : సరే.

రాత్రి : (ధైర్యం కుదుర్చుకుని) ఈ వార్త నిజమంటావా అన్నా ?

విశ్వం : ఏమో.

రాత్రి : తెలిసినంతవరకు ఆలోచిద్దాం.

విశ్వం : అనవసరం.

రాత్రి : నన్ను నమ్ముతావా పోనీ ?

విశ్వం : ఆ రాజాతో నీవు అంత చనువుగా మెలగడమేగా ఈ అనర్థానికి మూలం ?

రాత్రి : ఆ మాట మొట్ట మొదటనే ఎందుకు చెప్పలేదు ?

విశ్వం : ... .... .... .... .......... .... .... .... ....... .... .... .... .... ....

రాత్రి : రాజాను నీవు తన్ని తగిలేశావనేమాట నిజమా ?

విశ్వం : నీకు తెలియదా ?

రాత్రి : అతడు కొద్దిరోజుల నుండి మనింటికి రాకపోవడానికి కారణమదే అనుకొంటున్నాను.

విశ్వం : (తీక్షణంగా చూస్తూ) అబద్ధం. అతడు హాస్టల్లో తన రూమువిడిచి బైటికి రావడంలేదు.

రాత్రి : పాపం ! అతడు ఎంత తపించిపోతున్నాడో ! నే వెళ్ళి చూచివస్తాను. చెడ్డ కాపరానికి ముప్పేమిటి.

విశ్వం : ఈ రాత్రి బండికే ప్రయాణం.

రాత్రి : ఓ నేనన్నీ సదురుకునే కూర్చున్నాగా ? (నిష్క్రమిస్తుంది)

విశ్వం : ఈమె ధైర్యం అసాధారణం. ఇపుడు కర్తవ్య మేమిటి ? ఈ కుట్ర చండభాస్కరుగాడిదై వుంటుంది. దీనికి ప్రతీకారం చెయ్యడమా - కాలేజీ విడిచి పెట్టి పోవడమా - ఆలోచిస్తూ నిష్క్రమిస్తాడు. అంత పేపరు చేతితో పుచ్చుకుని, విచారంతో చిక్కి సగమైన రాజా ప్రవేశిస్తాడు)

రాజా : ఘోరం, రాత్రి ఏమనుకుంటున్నదో ! రేరాణి ఎంత కుమిలి పోతున్నదో! భూతాలు, ప్రజలు ఎంత కోపోద్రిక్తులై వున్నారో, బాధ్యతారహితంగా, నిజ నిజాలు అరయకుండా, ఇట్టి వార్తల్ని పత్రికలు ప్రకటించవచ్చునా ? ఈ కుట్ర కంతకూ కారణం ! చండభాస్కరుగాడే అయివుండాలి. ఎవరైనా - మేము మాత్రం అవమానం పాలైనాం. రాత్రి ఇక చదవదు, విశ్వం రేరాణిని ప్రేమించివున్నాడు. అతడు ఏమనుకుంటున్నాడో ! భూతాలుకు దీనిలోని కుట్ర అంతా బోధపరచవలసివుంది, ఆహా -- లోకం !

సత్యము నసత్యముగ చూప జాలుడొకడు
లేని అపవాదులెన్నో కల్పించు నొకడు
మంచివాడని పడద్రోయ నెంచునొకడు
మానవత్వము నాశనమయి నేడు !

(నిష్క్రమిస్తాడు. వెనుకనుంచి కర్రతో భూతాలు, చేతిలో పేపరుతో చండభాస్కరుడు ప్రవేశిస్తారు)

చండ : చూచావర్రా, పేపర్లో ఎలా పడిందో ? ఘోరం. ఇక మీ బ్రతుకులు ఎందుకైనా పనికొస్తాయా ? నాశనం చేసేశార్రా మిమ్మల్ని.

భూ : చిత్తం బాబయ్యా ! ఆడిమీద కసితీర్చుకోవాలి బాబయ్యా ! (కన్నీరు తుడుచుకుంటాడు)

చండ : (హఠాత్తుగా) అడుగోరా ! వాడే వాడే అడుగో !

భూ : (ఉగ్రుడై) ప్రజలు ! నీ తలకాయ ఎవడో కొట్టుకుపోతున్నాడంటే – అమ్మగాడిద కొడుకని వెనక కర్రేసుకువెళ్ళే రకం ప్రజలు ! (వికటహాసం చేస్తూ నిష్క్రమిస్తాడు. వెనుకనుంచి రాజా ప్రవేశించి, వెళ్ళిపోతూవుండే సమయంలో వెనుకమాటుగా వచ్చి "చావు బడవా" అంటూ భూతాలు ఒక్క దెబ్బ కొడతాడు. 'హా' అంటూ రాజా కూలి తెరలోకి పడిపోతాడు. భూతాలు వెనక్కి తిరిగి పోబోతూవుంటే రాత్రి "అయ్యో" అంటూ భూతాలు చెయ్యి పట్టుకుని రాజా పడినవైపుకి లాక్కుపోతుంది. అంత వెనుక నుంచి దినం ప్రవేశిస్తాడు.

దినం : (తలబాదుకొని) నే నెంత దుర్మార్గుణ్ణి ! డబ్బులేకపోతే భిక్షమెత్తు కుని అయినా చదువుకోవాలిగాని దుర్మార్గుడైన ధనవంతుణ్ణి ఆశ్రయించడం ఎంతపాపం ! నిత్యమూ అసూయాద్వేషాలతో కమిలిపోయే దుష్టుడు సంఘజీవితానికి విషం వంటివాడు. అట్టివాడి స్నేహంవల్ల నేనూ అలానే తయారై – అమాయకులు, పవిత్రజీవనులు, ప్రజాసేవకులు అయినవారిని అల్లరిపెట్టాను – అవమానపరిచాను. అన్యాయం చేశాను. నా అపచారానికి, నా దౌష్ట్యానికి, నా పాపానికి ప్రాయశ్చిత్తంలేదు. ఓరి భగవంతుడా, ఇప్పుడు నా కర్తవ్య మేమిటి ?

చండ : (ప్రవేశిస్తూ) ఏరా దినం !

దినం : (ఈసడింపుతో చూస్తాడు)

చండ : ఒరే మొన్న ఆ వేళ (చెయ్యి పట్టుకోబోతాడు)

దినం : (చూచి ఒక్క చెంపకాయ కొట్టి నిష్క్రమిస్తాడు)

చండ : (చెంపచేతబట్టుకుని) ఓరి ద్రోహీ ! ఓరీ తిన్నయింటి వాసాలు లెక్కపెట్టే మోసగాడా ! ఓరి పాలు త్రాగి రొమ్ము గుద్దేగాడిదా ! (వెనుక నిష్క్రమిస్తాడు. అంత కొంచెం సేపటికి తెరలేస్తుంది. హాస్పిటల్‌లో రాజా తలకట్టుత పడివుంటాడు. రాత్రి ఉపచర్యచేస్తూ వుంటుంది. భూతాలు ఏడుస్తూ నిలబడి వుంటాడు. దగ్గర కొందరు పోలీసులు వుంటారు)

రాత్రి : (పోలీసుల్ని ఉద్దేశించి) మీ సహాయానికి మేం కృతజ్ఞులం. మీరు వెళ్ళండి.

పోలీ : (భూతాలును చూపుతూ) ఇతడి మాట.

రాత్రి : అతడి మాట నేను చూసుకుంటాను.

పోలీ : మీ యిష్టం. కాని ఇతణ్ణి జైల్లో పెట్టడం మంచిది.

రాత్రి : అక్కర్లేదు. ఇతడు దుర్మార్గుడుకాడు. ఇతణ్ణి దుర్మార్గానికి దింపిన దుర్మార్గులున్నారు. అవసరమైనపుడు మీకు కబురు చేస్తాం.

పోలీ : సరే. మేము ప్రజాసేవకులం, మీ యిష్టం వచ్చినరీతిగా మమ్మ ఉపయోగించుకోవచ్చు. (నిష్క్రమిస్తారు)

రాత్రి : భూతాలు !

భూ : తల్లీ ! (రాత్రి కాళ్ళమీద పడతాడు) రక్షించావు మా తల్లీ ! లేకపోతే ఆ పోలీసుల చేతుల్లో తుక్కు తుక్కు అయిపోయేవాణ్ణి.

రాత్రి : నీకేమీ ఫర్వాలేదు, అంత అనవసరంగా పోలీసులు ఎన్నటికీ కొట్టరు. విచక్షణ, బుద్ధి లేకుండ ప్రవర్తించేవారు నీవంటి పెద్దలేగాని పోలీసులుకారు. స్వతంత్ర భారతదేశంలో నిజమైన ప్రజా సేవకులు పోలీసులే.

భూ : గడ్డితిన్నాను తల్లీ ! (ఏడుస్తాడు)

రాత్రి : జరిగిందాని కేమిచేస్తాంలే, ప్రజలు విద్యారహితులు, విజ్ఞాన శూన్యులు కావడంవల్ల ఇటువంటి దారుణాలు జరుగుతూ వుంటాయి.

(అంత విశ్వం మెల్లిగా ప్రవేశిస్తాడు)

విశ్వం : ఎంతఘోరం జరిగింది !

భూ : గడ్డి తిన్నాను తండ్రీ ! (విశ్వం కాళ్ళమీద పడతాడు)

(అంతలోనే దినం ప్రవేశిస్తాడు)

దినం : నువ్వేకాదోయ్ భూతాలు, నేనూ తిన్నాను గడ్డి. (మోకాళ్ళమీద వాలి అందరికీ నమస్కరిస్తాడు)

భూ : తెలివితక్కువ ప్రజలం బాబయ్య !

దినం : చదువుకోని, విజ్ఞానంలేని ప్రజలేనయం భూతాలు, కోపంవస్తే కర్రెత్తడం తప్పితే ప్రజలకేమీ చేతకాదు. చదువుకున్న వాళ్ళమే – విజ్ఞానవంతులమని విఱ్ఱవీగేవాళ్ళమే – దారుణమైన పశుకృత్యాలు చేస్తున్నాం. మానవపశువుల్లో నేను ఒక జాతి నికృష్టమైన పశువుని.

(అంత రేరాణి ప్రవేశిస్తుంది)

రేరా : (అందర్ని పరిశీలించి చూచి, దినాన్ని ఉద్దేశించి) అతణ్ణి ఇక్కడి నుంచి పొమ్మనండి.

రాత్రి : అతడు క్షమాభిక్షకోరుతూ వచ్చాడు, వుండనియ్యి.

రేరా : దుర్మార్గం చేసి క్షమించుమనేవాడు పరమదుర్మార్గుడు. అతణ్ణి క్షమించడానికి వీల్లేదు.

దినం : నిజంగా నేను క్షమార్హుణ్ణికాను. (దీనంగా వెళ్ళిపోతాడు)

భూ : జ్వరంలో వుండే వచ్చేశావా అమ్మా !

రేరా : నాన్నా ! నీవుకూడ క్షమార్హుడవు కాదు. ఇక్కడినుంచి వెళ్ళిపో.

రాత్రి : తప్పమ్మా రాణీ ! తప్పు చేసినా తండ్రిని అలా అనరాదు.

రేరా : (కన్నీరు తుడుచుకొంటూ) నేను ఉన్నదున్నట్టు చెప్పాను. తాను నమ్మలేదు.

రాత్రి : మగవాళ్ళంతా అంతే. వాళ్ళు మనతో నిజం చెప్పరు. మనం నిజం చెప్పినా నమ్మరు. అది వాళ్ళ స్వభావం, ఏం జేస్తాం ?

విశ్వం : క్షమించు చెల్లీ !

రాత్రి : క్షమించడానికేముంది ? బండికి టైం అవుతుందేమో, ఇక మనం పోదాం.

విశ్వం : మరి రాజా ?

రాత్రి : డాక్టర్లు, నర్సులు --

విశ్వం : కాదు, రాజా బాగుపడినతర్వాత వెళదాం భూతాలు !

భూ : బాబు !

విశ్వం : ఈ గోడలమీద వ్రాయబడిన వ్రాతగాని, పేపర్లో వ్రాయబడిన వార్తగాని నిజమనుకోవద్దు. దీనివల్ల మనకు పోయిన పరువేదీ లేదు. నిజం నిలకడమీద ప్రజలే తెలుసుకుంటారు. మరోవిధమైన బెంగలేమీ పెట్టుకోకు. ఇక ఇంటికి వెళ్ళండి.

భూ : మీదయ బాబు.

రాత్రి : (రేరాణి లోపలకి పోతూ వుండడం చూచి పట్టుకొని) అబ్బ ఎంత జ్వరం వుంది ! ఇక్కడే హాస్పిటల్లో వుంచేదాం ఈమెనికూడా. అన్నా నీవు ఈమెను తీసుకువెళ్ళి అడ్మిట్ చేయ్యించు)

(రేరాణి చెయ్యిపుచ్చుకుని విశ్వం నడిపించుకు వెళతాడు. భూతాలు వెనక వెళతాడు. రాత్రి కన్నీరు కారుస్తూ రాజావంక తదేకదృష్టితో చూస్తూ వుంటుంది. అతడు అవతలివాడు ఇవతలికి తిరిగి పడుకుంటాడు. ఆమె ఇటూ అటూ చూచి అతణ్ణి ముద్దు పెట్టు కుంటుంది.)

* * *